


RNI TELTEL/2024/89620

తెలంగాణ

నేటి

# శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 150 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | సోమవారం - 20 - జులై - 2026 | వెల రూ. 5 /-



## అఖిలపక్ష భేటీలో రగడ..

- నేటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు
- అఖిలపక్ష భేటీలో గందరగోళం
- టీఎంసీ రెబల్ ఎంపీలను ఆహ్వానించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు
- నిరసనగా సమావేశం నుంచి కొద్దిసేపు వాకౌట్ చేసిన విపక్ష నేతలు
- రెబల్ ఎంపీలకు ఇంకా స్పీకర్ ఆమోదం లేదని విపక్షాల వాదన
- గుర్తింపు కోరిన పార్టీలను పిలిచామని స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

2

### ఆగస్టు 3 వరకు

# ఎస్ఐఆర్‌పైనే ఫోకస్

### - నేతలకు సీఎం రేవంత్ కఠిన ఆదేశాలు!

- ఎస్ఐఆర్‌పై రేవంత్ కఠిన ఆదేశాలు
- ఆగస్టు 3 వరకు క్షేత్రస్థాయిలోనే ఉండాలని నేతలకు సూచన
- గాంధీభవన్‌కు రావొద్దన్న సీఎం
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- ఉత్తమ 100 బీఎల్ఏలకు రాహుల్‌తో కలిపిస్తామని హామీ







**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి పార్టీ నాయకత్వాన్ని అప్రమత్తం చేశారు. ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్‌పై నేడు నిర్వహించిన వర్చువల్ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎస్ఐఆర్ సమన్వయకర్తలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ బాధ్యతలు అప్పగించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ఇన్‌ఛార్జిలంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా మంత్రులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, చివరి బాధ్యత వారిపైనే ఉంటుందని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమన్వయ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించడాన్ని అవకాశం గా మలుచుకోవాలని రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి 10 మంది ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటూనే ఎంపీలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో సమీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. బాధ్యతలు నిర్వర్తించని ఎంపీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆగస్టు 3 వరకు గాంధీభవన్ కు ఎవరూ రావొద్దని సీఎం స్పష్టం చేశారు. జులై 30న మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని వెల్లడించారు. బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) నివేదికలపై మాత్రమే ఆధారపడొద్దని సీఎం సూచించారు. పార్టీ తరఫున పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) నివేదికలను కూడా తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. పార్టీ బీఎల్ఏలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని, క్షేత్రస్థాయిలో వారి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. రానున్న పది రోజులు నాయకులంతా నియోజకవర్గాల్లోనే పర్యటించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. గాంధీభవన్ బృందం బీఎల్ఏ, బీఎల్ఓ నివేదికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యుత్తమంగా పనిచేసిన 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసే అవకాశం కల్పించడంతో పాటు ఆయనతో ఫొటో దిగే అవకాశం కూడా ఇస్తామని ప్రకటించారు.

### హైదరాబాద్ జాతీయ పోలీస్ అకాడమీలో

## లైంగిక వేధింపుల కలకలం

### - ట్రైనీ ఐపీఎస్ పై కేసు




- హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో దారుణ ఘటన
- మహిళా ఐపీఎస్ ట్రైనీపై లైంగిక వేధింపులకు పాల్పడిన సహోద్యోగి
- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు
- కత్తితో బెదిరించి, అభ్యంతరకర వీడియోలు తీశాడని బాధితురాలి ఫిర్యాదు

2

### టోక్యోలో

## సింధు తుపాన్..

### చరిత్ర సృష్టించిన భారత స్టార్ షట్లర్



- జపాన్ ఓపెన్‌లో సింధు ఛాంపియన్
- తొలి భారత విజేతగా చరిత్ర
- ఫైనల్లో యమగుచిపై విజయం
- 21-17, 21-17తో సింధు ఆధిపత్యం
- ఏడేళ్ల తర్వాత సూపర్-750 టైటిల్
- రెండేళ్ల తర్వాత బీడబ్ల్యూఎఫ్ కిరీటం

**నేటి శుభోదయ, డెస్క్ :** ఏడేళ్లుగా ఎదురు చూస్తున్న పెద్ద టైటిల్ ఎట్టకేలకు పీవీ సింధు చేతికి చేరింది. ఆతిథ్య దేశం అభిమానుల మధ్య, నాలుగుసార్లు జపాన్ ఓపెన్ విజేత అకానే యమగుచిని ఆమె సొంతగడ్డపైనే ఓడించి భారత స్టార్ షట్లర్ ఘన విజయం సాధించింది. జపాన్ ఓపెన్ సూపర్–750 టోర్నీలో తొలిసారి విజేతగా నిలవడమే కాదు.. ఈ ఘనత సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. టోక్యో మెట్రోపాలిటన్ జిమ్నేషియంలో ఆదివా రం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో సింధు 21–17, 21–17తో అకానే యమగుచిపై ఆధిపత్యం చాటింది. తొలి గేమ్‌లో ఇద్దరూ హోరాహోరీగా తలపడినా.. 17–17 సమయానికి సింధు తన ...

2

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కలకలం..

## విమానాలపై లేజర్ దాడులు!

- దేశంలోనే అత్యధికంగా లేజర్ బీమ్ ప్రమాదాలు ఎదుర్కొంటున్న శంషాబాద్ విమానాశ్రయం
- గడిచిన రెండేళ్లలో హైదరాబాద్‌లో 100కు పైగా లేజర్ కేసుల నమోదు
- ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి వచ్చిన లూఫ్తాన్సా విమానంపై ఇటీవల లేజర్ దాడి
- విమానాశ్రయం చుట్టుపక్కల ఉన్న ఫాంహౌస్‌లు, వెడ్డింగ్ హాళ్లే కారణమని గుర్తింపు

2



## పాతబస్తీలో కలకలం

### విద్యార్థిని పొడిచి చంపిన దుండగుడు

- హైదరాబాద్ పాతబస్తీలో ఇంటర్ విద్యార్థి దారుణ హత్య
- మహమ్మద్ ఫైజ్ అనే విద్యార్థిని కత్తితో పొడిచిన దుండగుడు
- సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టిన ప్రత్యేక బృందాలు

2



### భారీ వర్షాల హెచ్చరిక: అమర్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత



- పహల్గామ్, బల్తాల్ రెండు మార్గాల్లోనూ యాత్రకు బ్రేక్
- వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో వైష్ణోదేవి యాత్ర కూడా రద్దు
- బేస్ క్యాంపుల వద్ద యాత్రికులను నిలిపివేసిన అధికారులు
- వాతావరణం మెరుగయ్యాకే యాత్ర పునఃప్రారంభంపై నిర్ణయం

2

## జమ్మూ కశ్మీర్‌లో జల ప్రళయం.. 12 మంది మృతి

- జమ్మూ కశ్మీర్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, విరిగిపడిన కొండచరియలు
- 12 మంది ప్రాణాలు కోల్పోయిన వైనం
- పూంచ్, రాజౌరీ జిల్లాల్లో తీవ్ర ఆస్తి నష్టం
- నిరసన రద్దు చేసుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న సీఎం
- ఇంకా పలువురి ఆచూకీ గల్లంతు, కొనసాగుతున్న సహాయక చర్యలు



**నేటి శుభోదయ, జమ్మూ కశ్మీర్ :** జమ్మూ కశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలు పూంచ్, రాజౌరీలలో ఆదివారం కురిసిన కుండపోత వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో మొత్తం 12 మంది మరణించారు. ఇంకా పలువురి ఆచూకీ తెలియరాలేదు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా వందలాది ఇళ్లు, పాఠశాలలు ధ్వంసమవగా, భారీగా ఆస్తి నష్టం సంభవించింది. అధికారుల వివరాల ప్రకారం, పూంచ్ జిల్లాలో 9 మంది మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. రాజౌరీ జిల్లాలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు గల్లంతయ్యారు, ఒకరు గాయపడ్డారు. గల్లంతైన వారి కోసం ఆర్మీ, పోలీసులు, స్థానిక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ముఖ్యంగా పూంచ్ జిల్లాలోని సురన్‌కోట్ తహసీల్‌లో నష్టం తీవ్రంగా ఉంది. ఈ రెండు జిల్లాల్లో కలిపి .......

2

# టోక్యోలో సింధు తుపాన్..

## - చరిత్ర సృష్టించిన భారత స్టార్ షట్లర్

**మొదటిపేజీ తరువాయి..** అనుభవాన్ని చూపించింది. వరుసగా నాలుగు పాయింట్లు సాధించి తొలి గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. అదే మ్యాచ్‌కు కీలక మలుపుగా మారింది. రెండో గేమ్‌లో సింధు మరింత దూకుడుగా ఆడింది. ఆరంభంలోనే ఆధిక్యం సాధించి యమగుచిపై ఒత్తిడి పెంచింది. మధ్యలో జపాన్ స్టార్ పుంజుకుని స్కోరు 18–17కు తీసుకొచ్చినా.. కీలక సమయంలో సింధు ఏమాత్రం తడబడలేదు. వరుస పాయింట్లతో మ్యాచ్‌ను ముగించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. స్వదేశీ అభిమానుల హర్షధ్వానాల మధ్య యమగుచిని నిలువరించడం సింధు విజయానికి మరింత ప్రత్యేకత తీసుకొచ్చింది. ఈ టైటిల్‌తో సింధు రెండేళ్ల తర్వాత బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో మళ్లీ ఛాంపియన్‌గా నిలిచింది. గతంలో 2024 డిసెంబరులో సయ్యద్ మోదీ టోర్నీ గెలిచిన తర్వాత ఆమెకు ఇదే తొలి వరల్డ్ టూర్ టైటిల్. అంతేకాదు.. సూపర్–750 లేదా అంతకంటే ఉన్నత స్థాయి టోర్నీల్లో ఏడేళ్ల తర్వాత మళ్లీ విజేతగా నిలిచి తన పునరాగమనాన్ని ఘనంగా చాటింది. ఈ టైటిల్ సాధించే క్రమంలో సింధు అత్యున్నత స్థాయి ఆటను ప్రదర్శించింది. ప్రీక్వార్టర్స్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హాన్ యూయేను ఓడించింది. ఆ తర్వాత టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత చెన్ యూఫైపై అద్భుత విజయం సాధించింది. ఫైనల్లో యమగుచిని మట్టికరిపించి జపాన్ ఓపెన్ ట్రోఫీని ముద్దాడింది. ఒకప్పుడు ప్రపంచ బ్యాడ్మింటన్‌ను శాసించిన సింధు మళ్లీ తన పాత లయను అందుకుంటోందనే సంకేతాలను ఈ టోర్నీ స్పష్టంగా చూపించింది.

# జమ్మూ కశ్మీర్‌లో జల ప్రళయం.. 12 మంది మృతి

**మొదటిపేజీ తరువాయి..** 130కి పైగా ఇళ్లు, 18 పాఠశాలలు, అనేక వాహనాలు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో మొబైల్ కనెక్టివిటీ పూర్తిగా స్తంభించిపోయింది. వందలాది ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సుమారు 127 కనాల్స్ విస్తీర్ణంలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. విషయం తెలియగానే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఢిల్లీలో తలపెట్టిన తన నిరసన కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హుటాహుటిన జమ్మూకు చేరుకున్నారు. ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి సహాయక చర్యలను సమీక్షించారు. బాధితుల ప్రాణాలను కాపాడటమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఇతర రాజకీయ నేతలు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బాధితులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

# అఖిలపక్ష భేటీలో రగడ..

**మొదటిపేజీ తరువాయి..** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు కొన్ని గంటల ముందు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో గందరగోళం చెలరేగింది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రెబల్ ఎంపీలకు ఆహ్వానం పలకడాన్ని నిరసిస్తూ విపక్ష పార్టీల నేతలు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అయితే, ఇది కేవలం సాంకేతిక నిరసన మాత్రమేనని తెలిపి, కొద్ది నిమిషాలకే తిరిగి సమావేశంలో పాల్గొన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల అజెండాను చర్చించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశం మొదలైన వెంటనే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఆప్, శివసేన (యూబీటీ) సహా పలు విపక్ష పార్టీల నేతలు నిరసనగా బయటకు వెళ్లిపోయారు. టీఎంసీ నుంచి తిరుగుబాటు చేసిన సుమారు 20 మంది ఎంపీలు నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరారు. అయితే, ఈ విలీనానికి లోక్‌సభ స్పీకర్ నుంచి అధికారికంగా ఎలాంటి ఆమోదం లభించలేదని, పార్లమెంట్ రికార్డుల్లో వారు ఇంకా టీఎంసీ ఎంపీలుగానే ఉన్నారని విపక్షాలు వాదించాయి. పార్లమెంట్ వెబ్‌సైట్‌లో ఎన్‌సీపీఐ అనే పార్టీయే లేనప్పుడు వారిని ఎలా ఆహ్వానిస్తారని టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ ప్రశ్నించారు. ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనని విపక్షాలు ఆరోపించాయి. ఈ పరిణామంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. స్పీకర్ వద్ద గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న పార్టీలను ఆహ్వానించడం తమ బాధ్యత అని తెలిపారు. మరోవైపు, తమకు ఆహ్వానం అందడాన్ని ఎన్‌సీపీఐ నేత కకోలి ఘోష్ దస్తిదార్ స్వాగతించారు. ఈ ఘటనతో వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమావేశాల్లో నీట్ పరీక్షల లీకేజీలు, వ్యవసాయ సమస్యలు, రామాలయ విరాళాల అంశాలను లేవనెత్తాలని విపక్షాలు సిద్ధమవుతున్నాయి.

# హైదరాబాద్ జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం.. ట్రైనీ ఐపీఎస్ పై కేసు

**మొదటిపేజీ తరువాయి..** దేశంలోనే అత్యున్నత పోలీస్ శిక్షణా కేంద్రమైన హైదరాబాద్ లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (SVPNPA)లో ఒక దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న తీవ్ర ఆరోపణలపై ఉదయ్ కృష్ణారెడ్డి అనే ట్రైనీ ఐపీఎస్‌పై కేసు నమోదైంది. ఈ ఘటన పోలీస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే, అకాడమీలో శిక్షణ పొందుతున్న ఒక ఐపీఎస్ ప్రొబేషనర్, తన సహోద్యోగి అయిన ఉదయ్ కృష్ణారెడ్డి తనను కొంతకాలంగా వేధిస్తున్నాడని అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు తనకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడంతో పాటు, మానసికంగా వేధిస్తూ, దుర్భాషలాడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో జూలై 9న నిందితుడు తనను బలవంతంగా ఒక గదిలోకి లాక్కెళ్లాడని, జుట్టు పట్టుకుని మెడపై కత్తి పెట్టి బెదిరించాడని బాధితురాలు ఆరోపించారు. అంతేకాకుండా, ఆమె ప్రైవేట్ వీడియోలను బలవంతంగా చిత్రీకరించి, ఆమె మొబైల్ ఫోన్ లాక్కుని, ఆ వీడియోలను ఆమె భర్త వాట్సాప్‌కు పంపాడని ఫిర్యాదులో వివరించారు. బాధితురాలి ఫిర్యాదు స్వీకరించిన అత్తాపూర్ పోలీసులు, నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్లు 74, 75, 77, 315(2)తో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 66(C) కింద కేసు నమోదు చేశారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కలకలం..

# విమానాలపై లేజర్ దాడులు!

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) పరిసరాల్లో విమానాల భద్రతకు సరికొత్త ముప్పు పొంచి ఉంది. విమానాలు టేకాఫ్ అవుతున్నప్పుడు లేదా ల్యాండింగ్ కోసం వస్తున్నప్పుడు వాటిపైకి శక్తివంతమైన లేజర్ కిరణాలను ప్రయోగించే ఘటనలు నగరంలో ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. గడిచిన రెండేళ్లలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పరిధిలో ఇలాంటివి 100కు పైగా కేసులు నమోదు కావడం ఏవియేషన్ రంగాన్ని ఉలిక్కిపడేలా చేసింది. దాదాపు రెండు వారాల క్రితం జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగరం నుండి హైదరాబాద్ వచ్చిన లూఫ్తాన్సా విమానానికి ల్యాండింగ్ సమయంలో ఒక ప్రమాదకరమైన అనుభవం ఎదురైంది. రన్‌వేపైకి వస్తున్న క్రమంలో విమానం కాక్‌పిట్‌పైకి ఒక్కసారిగా లేజర్ కాంతి దూసుకొచ్చింది. అత్యంత కీలకమైన ల్యాండింగ్ సమయంలో లేజర్ వెలుతురు వల్ల పైలట్ల కంటి చూపునకు తాత్కాలికంగా అంతరాయం కలిగింది. పైలట్లు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా 43 విమానాశ్రయాలలో 1,000కు పైగా ఇలాంటి లేజర్ ఘటనలు నమోదు కాగా.. అందులో 10 శాతం కేవలం హైదరాబాద్ లోనే జరిగాయి. ముంబై, బెంగళూరు వంటి పెద్ద నగరాల కంటే హైదరాబాద్‌లోనే ఈ తరహా కేసులు రెండింతలు ఎక్కువగా ఉన్నాయి. దేశంలో ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా తర్వాత హైదరాబాద్ ఈ జాబితాలో నాలుగో స్థానంలో నిలిచింది. "కేవలం కొన్ని సెకన్ల పాటు లేజర్ కాంతి పైలట్ల కళ్లపై పడినా వారు తాత్కాలికంగా గుడ్డివారవుతారు. ఇది విమాన భద్రతకు తీవ్ర ముప్పు" అని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ ప్రెసిడెంట్ కెప్టెన్ సి.ఎస్.రంధావా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎయిర్‌పోర్ట్ చుట్టుపక్కల ఉన్న ఫాంహౌస్‌లు, ఫంక్షన్ హాళ్లు, పెళ్లి వేడుకల్లో వాడే డీజే లైట్లు, హై–పవర్ లేజర్ బీమ్స్ విమానాల మార్గానికి అడ్డుగా వస్తున్నట్లు గుర్తించారు. ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లోని నాలుగు ఫాంహౌస్‌లు, రెండు వెడ్డింగ్ హాళ్ల యజమానులకు పోలీసులు ఇప్పటికే తీవ్ర హెచ్చరికలతో కూడిన నోటీసులు జారీ చేశారు. విమానాల భద్రతకు భంగం కలిగించేలా లేజర్ లైట్లు వాడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# భారీ వర్షాల హెచ్చరిక

## - అమర్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

**మొదటిపేజీ తరువాయి..** జమ్మూకశ్మీర్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు శ్రీ అమర్‌నాథ్‌జీ పుణ్యక్షేత్రం బోర్డు, స్థానిక యంత్రాంగం ప్రకటించాయి. యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. జులై 19 నుంచి పహల్గామ్, బల్తాల్ రెండు మార్గాల్లోనూ యాత్రను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. భారత వాతావరణ శాఖ (IMD) జారీ చేసిన నివేదికల ప్రకారం, జులై 19 నుంచి 23 వరకు జమ్మూకశ్మీర్‌లోని పలు జిల్లాల్లో ఉరుములతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీనివల్ల ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదంతో పాటు, కొండచరియలు విరిగిపడటం, నదుల్లో నీటిమట్టం పెరగడం వంటి ముప్పు పొంచి ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ పరిణామాల దృష్ట్యా యాత్రను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించారు. ఈ ఆదేశాల మేరకు బల్తాల్, నున్‌వాన్/చందన్‌వాడీ బేస్ క్యాంపుల వద్ద ఉన్న యాత్రికులను ముందుకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత, మార్గాల భద్రతను క్షుణ్ణంగా సమీక్షించి యాత్ర పునఃప్రారంభంపై తదుపరి ప్రకటన చేస్తామని స్పష్టం చేశారు. ఇదే తరహా వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో వైష్ణోదేవి యాత్రను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ఏడాది 57 రోజుల పాటు సాగనున్న అమర్‌నాథ్ యాత్రలో ఇప్పటివరకు 3.7 లక్షల మందికి పైగా భక్తులు పవిత్ర గుహను దర్శించుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ యాత్ర ఆగస్టు 28న ముగియనుంది. భక్తుల సౌకర్యార్థం బేస్ క్యాంపుల వద్ద భద్రతా, వైద్య బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

# పాతబస్తీలో కలకలం విద్యార్థిని పొడిచి చంపిన దుండగుడు

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్ పాతబస్తీలో ఓ ఇంటర్మీడియట్ విద్యార్థి దారుణ హత్యకు గురవ్వడం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టీక్రీ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలో మహమ్మద్ ఫైజ్ అలియాస్ అజాన్ అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం, గుర్తు తెలియని దుండగుడు ఫైజ్‌పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో అతను సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్ సాయంతో కీలక ఆధారాలను సేకరించారు. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తూ నిందితుడిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో దర్యాప్తును వేగవంతం చేశారు.

# పుష్కరాల లోపే భద్రాద్రి వైభవం

## 15 రోజుల ముందే సిద్ధం చేయండి -అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం





**భద్రాచలం, నేటి శుభోదయ :**
రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన ప్రాచీన వైభవానికి ప్రతీకగా నిలిచేలా పునరుద్ధరణ పనులను వచ్చే గోదావరి పుష్కరాల నాటికి వంద శాతం పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. పుష్కరాల ప్రారంభానికి 15 రోజుల ముందే క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన భద్రాద్రి రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో సాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సబ్ కలెక్టర్ కార్యాలయంలో దేవాదాయ, ఇంజినీరింగ్ అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ "రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన మొదటి శ్రీరామనవమి పర్వదినాన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భద్రాద్రి పునరుద్ధరణకు నాంది పలికాం. ఇందుకోసం ప్రభుత్వం రూ.351 కోట్లు మంజూరు చేసింది. ఆలయ విస్తరణ, అభివృద్ధికి అత్యంత కీలకమైన భూసేకరణ ప్రక్రియ కోసం ఇప్పటికే రూ.75 కోట్లు వెచ్చించాం" అని వివరించారు.

**ఆగమశాస్త్రం ప్రకారం.. అదనపు కార్మికులతో**
భద్రాద్రి క్షేత్ర ఆధ్యాత్మిక, చారిత్రక విశిష్టత చెక్కుచెదరకుండా, నిపుణులైన శిల్పులతో, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. "పురాతన గోపురాలు, కట్టడాల సహజత్వానికి భంగం కలగకుండా ఆగమశాస్త్రాల ప్రకారం పనులు జరగాలి. పనుల్లో వేగం పెంచేందుకు అవసరమైన చోట ప్రస్తుత సిబ్బంది కంటే 25 శాతం అదనంగా కార్మికులను నియమించాలి. నిరంతరం నిపుణులు, బాధ్యతాయుతమైన అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పర్యవేక్షించాలి" అని ఆదేశించారు. ఒకవైపు పనులు పూర్తయిన తర్వాతే మరోవైపు పనులు ప్రారంభించాలని, ఎక్కువ పని ఉన్న ఉత్తర భాగంలో పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డ్రాయింగ్‌లు, సాంకేతిక అనుమతుల్లో జాప్యానికి తావులేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు.

**పది రోజులకోసారి క్షేత్రస్థాయి సమీక్ష**
ఆలయ పనుల పర్యవేక్షణ కోసం ఇంజినీరింగ్ శాఖ నుంచి ప్రత్యేక అధికారిని వెంటనే నియమించాలని దేవాదాయ కమిషనర్ హనుమంతరావును మంత్రి టెలిఫోన్ ద్వారా ఆదేశించారు. కమిషనర్ ప్రతి 10 రోజులకోసారి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రగతిని పరిశీలించాలన్నారు. పనులు జరుగుతున్న సమయంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాల నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతంలో భక్తుల విజ్ఞప్తుల మేరకు నూతన స్నాన ఘట్టాల నిర్మాణం, యాత్రికుల వసతుల విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. తొలుత సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్ వద్ద మంత్రికి కలెక్టర్ అంకిత్ మొక్క అందించి స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఈవో దామోదరరావు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం మంత్రికి వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గ్రామ సర్పంచ్ పూనెం దొర, ఆర్కిటెక్ట్ మూర్తి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క కృషి ఫలించింది

**ఖమ్మం, మధిర, నేటి శుభోదయ :**
"కల కలగానే మిగలలేదు. మధిర విద్యార్థుల కల నేడు ప్రభుత్వ నిర్ణయంతో నిజమైంది."ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో నూతన ప్రభుత్వ జేఎన్ టియు ఇంజినీరింగ్ కళాశాల స్థాపనకు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అనుమతి మంజూరు చేయడం పట్ల మధిర నియోజకవర్గ ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఈ కలను సాకారం చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి మధిర నియోజకవర్గ ప్రజలు, విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులోకి రావడంతో పాటు, మధిర నియోజకవర్గ విద్యా అభివృద్ధికి ఇది ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది.మధిర ప్రజల కలను నిజం చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

TECHNICAL EDUCATION – Establishment of New Government Engineering College at Madhira Constituency, Khammam District – Orders - Issued – Reg.

HIGHER EDUCATION (TE) DEPARTMENT

G.O.Ms.No. 25 Dated: 18-07-2026

Read:

From the Principal Secretary to CM, Note Rc No.15/PSCM(NS)/2026, 11.07.2026.

*****

ORDER:

Government has decided to accord permission for establishment of new Government Engineering College at Madhira Constituency, Khammam District, subject to fulfillment of conditions as stipulated by the All India Council for Technical Education.

2. Orders regarding courses, staff and other amenities to be sanctioned to the Government Engineering College at Madhira Constituency, Khammam District will be issued separately.

3. The Commissioner of Technical Education, Telangana, Hyderabad, the Secretary, TGCHE and the Registrar, JNTUH, Telangana, Hyderabad shall take necessary further action in the matter.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

DR.YOGITA RANA
SECRETARY TO GOVERNMENT

# హతీరాం బాపు మహా భోగ్ బండారో కార్యక్రమంలో పాల్గొన్న బానోత్ మనీషా మదన్ లాల్



**ఏన్కూర్, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండలం మూలపోచారం గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనగర్ తండా బూడియా బాపు దేవస్థానంలో శ్రీ శ్రీ హతీరాం బాపూజీ జయంతి సందర్భంగా సేవాలాల్ సేన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా మహా భోగ్ బండారో కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు బానోత్ మనీషా మదన్ లాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భోగ్ బండారో కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ శ్రీ హతీరాం బాపూజీ బోధనలు సమాజానికి ఆదర్శప్రాయమని, సేవా భావం, ఐక్యత, సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బంజారా సమాజం తమ సంప్రదాయాలు, ఆచారాలను భావితరాలకు అందించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బంజారా కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, సేవాలాల్ సేన కమిటీ నాయకులు, యువత, మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆంజనేయ నగర్ కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను -బండి రమేష్




**హైదరాబాద్, నేటి శుభోదయ :**
కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ని ఆంజనేయ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ నివాసితులు ఆదివారం శ్రీ హిమదుర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఇటీవల నిర్వహించిన బైలాస్ కమిటీ సమావేశంలో కాలనీ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై బండి రమేష్ అందించిన అమూల్యమైన సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా తమకు మార్గదర్శకత్వం వహిస్తూ, కాలనీ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ "నేను కేవలం ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా, ఆంజనేయ నగర్ కాలనీ నివాసుడిగా కూడా మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను. కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో మీతో కలిసి పనిచేస్తూ, మీకు నిరంతరం తోడుగా నిలుస్తాను" అని హామీ ఇచ్చారు. బండి రమేష్ హామీపై కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు, గంట సుబ్బారావు, రామానుజన్ రెడ్డి, ధర్మారావు, ప్రతాప్, హనుమాన్, శ్రీనివాస్, శ్యామ్, చక్రధర్, సుబ్బు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి హాజరైన ఎం పి వద్దిరాజు రవిచంద్ర




**న్యూఢిల్లీ, నేటి శుభోదయ**
పార్లమెంట్ అనెక్స్ భవనంలో ఆదివారం జరిగిన అఖిల పక్ష సమావేశానికి రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేత వద్దిరాజు రవిచంద్ర హాజ ర య్యారు. పార్లమెంట్ వానాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రభుత్వం అఖిలపక్ష నేతలతో భేటీ అయ్యింది. పార్లమెంటరీ పార్టీ లీడర్ గా నియమితులైన తర్వాత ఎంపీ రవిచంద్ర మొట్టమొదటి సారి జరుగుతున్న ఈ సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయనకు వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు, అభినందించారు.ఈ సమావేశానికి అధికార పక్షం నుంచి మంత్రులు రాజనాధ్ సింగ్,జే.పీ.నడ్డా,కిరణ్ రిజుజు తదితరులు హాజరయ్యారు.

# పివి సింధుకు అభినందనలు తెలిపిన మాజీ మంత్రి పువ్వాడ



**హైదరాబాద్, నేటి శుభోదయ :**
జపాన్ ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శనతో ఛాంపియన్‌గా నిలిచి మరోసారి భారత కీర్తిని అంతర్జాతీయ వేదికపై రెపరెపలాడించిన భారత స్టార్ షట్లర్ పి.వి. సింధుకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అభినందనలు తెలిపారు. ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ తిరిగి అత్యున్నత స్థాయిలో నిలవడం పట్ల ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో జరగనున్న ప్రపంచస్థాయి పోటీల్లో కూడా సింధు ఇదే విజయ పరంపరను కొనసాగించాలని ఆకాంక్షించారు.

# నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

**ఖమ్మం, నేటి శుభోదయ :**
నేడు (జూలై 20) సోమవారం రోజున ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన కారణాల రీత్యా సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించుట లేదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి, ఎవరూ కూడా దరఖాస్తులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావద్దని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# మధిర ఇంజినీరింగ్ కళాశాలను జాతీయ స్థాయి ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దాలి

**ఖమ్మం, నేటి శుభోదయ :**
మధిర నియోజకవర్గంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల జాతీయ సహ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి స్వాగతించారు. ఖమ్మం జిల్లాలోని గ్రామీణ, గిరిజన, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో ఇది ఒక కీలక నిర్ణయమని పేర్కొంటూ ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఈ కళాశాలను దేశంలోనే ఆదర్శవంతమైన ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందించాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఆయన ఒక సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం ద్వారా విద్యా రంగంలో చారిత్రాత్మక సంస్కరణలు తీసుకువచ్చిందని, నాణ్యమైన ఉన్నత విద్య, పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ సుధాకర్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నేతృత్వంలో ఈ నూతన కళాశాలకు ఏఐసీటీఈ సహకారం, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ తరగతి గదులు, స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్లు, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు, పరిశ్రమలతో భాగస్వామ్య కార్యక్రమాలు కల్పిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు), డేటా సైన్స్, రోబోటిక్స్, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ వంటి నూతన సాంకేతిక రంగాల్లో సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని ఆయన తన వినతిపత్రంలో కోరారు.వ్యవసాయం, ఉద్యానవన పంటలు, ఆహార ప్రాసెసింగ్ రంగాలకు ఖమ్మం జిల్లా ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ వంటి ప్రాజెక్టులతో ఈ ఇంజినీరింగ్ కళాశాలను అనుసంధానం చేయాలని ఆయన సూచించారు. దీనిద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన యువ ఇంజినీర్లు తయారవడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ మంచి కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం తన వంతు సహకారం అందిస్తే, మధిర ఇంజినీరింగ్ కళాశాల తెలంగాణకే కాకుండా దేశానికే ఆదర్శ విద్యాసంస్థగా ఎదుగుతుందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని డాక్టర్ సుధాకర్ రెడ్డి ఆకాంక్షించారు.

# గడ్కోల్ గురుడు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా వేల్పూర్ గంగారెడ్డి

**-సంఘ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడి**



**నిజామాబాద్, నేటి శుభోదయ :**
సిరికొండ మండల పరిధిలోని గడ్కోల్ గ్రామ గురుడు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా వేల్పూర్ గంగారెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గంగారెడ్డిని సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ బలోపేతంతో పాటు, సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గురుడు కాపు సంఘం ప్రతినిధులు, సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సిరికొండ కేజీబీవీ హాస్టల్‌లో ఉచిత వైద్య శిబిరం

**-విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు**




**నిజామాబాద్, నేటి శుభోదయ**
సిరికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC) పరిధిలోని సర్వపల్లి తండా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (KGBV) హాస్టల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ అరవింద్ ఆధ్వర్యంలో ఈ శిబిరం విజయవంతంగా కొనసాగింది.ముఖ్య విశేషాలు:ఆరోగ్య పరీక్షలు: శిబిరంలో పాల్గొన్న విద్యార్థినులకు హిమోగ్లోబిన్ (Hb), మలేరియా, మరియు డెంగ్యూ వంటి వివిధ రకాల రక్త పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.అవగాహన సదస్సు: పరీక్షలతో పాటు విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు మరియు సిబ్బంది ప్రత్యేక అవగాహన కల్పించారు.పరిసరాల పరిశీలన: హాస్టల్ ప్రాంగణాన్ని సందర్శించిన వైద్యాధికారి.. అక్కడ నీరు నిల్వ ఉండటం, తాగునీటి నిర్వహణలో ఉన్న లోపాలను గుర్తించారు.సిబ్బందికి సూచనలు: వర్షాకాలం దృష్ట్యా దోమలు వ్యాపించకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందికి డాక్టర్ అరవింద్ స్పష్టమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, కేజీబీవీ హాస్టల్ అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# ధర్పల్లి ఎన్టీఆర్ కాలనీలో పోలీసుల 'కమ్యూనిటీ కాంటాక్ట్' ప్రోగ్రామ్.. 32 వాహనాలు సీజ్



**నిజామాబాద్, నేటి శుభోదయ :**
ధర్పల్లి మండలంలోని ఎన్టీఆర్ కాలనీలో పోలీసులు శనివారం ఉదయం 'కమ్యూనిటీ కాంటాక్ట్' ప్రోగ్రామ్ నిర్వహించారు. ఏసీపీ గారి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బందితో కలిసి కాలనీలో విస్తృతంగా ఇంటింటి తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు (డాక్యుమెంట్స్) లేని 32 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.ఈ సందర్భంగా అధికారులు స్థానిక ప్రజలతో సమావేశమై పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారుకాలనీల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతను వివరించారు.ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ప్రయాణాల్లో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహన పత్రాలను ఎల్లప్పుడూ దగ్గర ఉంచుకోవాలని సూచించారు.నిబంధనలను ఉల్లంఘించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# సాంస్కృతిక రంగంలో మార్పులు ద్వారా మెరుగైన సమాజం

**- పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు**



**బోనకల్, నేటి శుభోదయ :**
సాంస్కృతిక రంగంలో మార్పులు ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన స్టడీ సర్కిల్ లో సాంస్కృతిక రంగంలో మార్పులు అనే అంశంపై ఆయన మాట్లాడారు. కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ప్రత్యామ్నాయ శ్రమైక జీవన సౌందర్యం వెల్లివిరిసే సమాజంకోసం అభ్యుదయ కవులు, కళాకారులు, రచయితలు పని చేయాలని పల్లా కొండలరావు కోరారు. రాజుల కాలం నుండి కవులు, కళాకారులు, రచయితలు ఒకే రకంగా లేరన్నారు. నేడు కూడా దోపిడీ శక్తులకు భజన చేసే వారు, వాటిని నిరోధించేందుకు ప్రయత్నం చేస్తున్నవారూ ఉన్నారన్నారు. సమాజంలో సంప్రదాయాలను యథాతథంగా కొనసాగేలా ఉండే కార్యక్రమాలు, సంస్కృతిని కాకుండా ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని నిర్మించేందుకు, వాటిని ప్రజలు ఆచరించేలా చైతన్య పరిచేందుకు రచనలు, కళలు దోహదం చేయాలన్నారు. దేశంలో ప్రశ్నించే, ఆలోచింపజేసే, ప్రగతిశీల శక్తులను నిలువరించేందుకు, నిర్బంధించేందుకు పాలకులు కుట్రలు చేస్తున్నారని, వాటిని నిస్సిగ్గుగా బహిరంగంగా సమర్థించే లంపెన్ శక్తులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కళ కల కోసమో, కాసుల కోసమో కాకుండా ప్రజలను జాగృతం చేసేందుకు ఉపయోగ పడాలన్నారు. నేటి కార్పొరేట్ సంస్కృతిలో పాలకులను పొగుడుతూ పాటలు రచించి సంపాదించేవారు, వాటి ఆధారంగా డిజేలతో విష సంస్కృతివైపు యువతను నడిపిస్తున్నశక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువతను ఆలోచించకుండా, ప్రశ్నించకుండా, పోరాటాలవైపు మళ్ళకుండా చేసే సాంస్కృతిక కార్యక్రమాలకు భిన్నంగా ఆచరణలో ప్రత్యామ్నాయ కార్యక్రమాలు, కళలు రూపొందించేందుకు అభ్యుదయ రచయితలు ముందుకు రావాలని, వారిని ప్రజలు కాపాడుకోవాలని, ప్రోత్సాహం అందించాలని కోరారు. ఇది జరుగుతుంటే సమాజం మళ్ళీ అంధకారంలోకి నెట్టబడడం ఖాయమన్నారు. ప్రస్తుతం దేశంలో దుర్మార్గమైన, ప్రమాదకరమైన సంస్కృతిని పెంచేందుకు పాలకులు ప్రయత్నం చేస్తుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కిలారు సురేష్, గుగులోతు నరేష్, బొప్పాల రమేష్, చేపూరి వెంకటేశ్వర్లు, కొండేటి అప్పారావు, జొన్నలగడ్డ సునీత, కుక్కల కోటేశ్వరరావు,కూచిపూడి మురళి, కౌసాని సూర్యప్రకాష్ రావు, పిల్లలమర్రి వెంకట అప్పారావు, గండు సైదులు, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వే పనులు గడువులోగా పూర్తి చేయాలి

**అటవీ–రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి - మంత్రి పొంగులేటి**



**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ :**
జిల్లాలో చేపడుతున్న భూముల రీ–సర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రీ–సర్వే పనుల్లో జాప్యం, నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.ఆదివారం సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భూముల రీ–సర్వే పురోగతి, అటవీ–రెవెన్యూ భూ సమస్యలు, పోడు భూముల అంశం, పాల్వంచ శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో 70 గ్రామాల్లో రీ–సర్వే చేపట్టగా ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని, ఐదు గ్రామాల్లో పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా పాల్వంచలో సర్వే పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, జాప్యానికి కారణాలను వెంటనే తొలగించాలని సూచించారు.రీ–సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, అవసరమైన చోట అదనపు సర్వేయర్లు, రోవర్ పరికరాలు, సాంకేతిక సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.అటవీ– రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి చట్టబద్ధంగా, సామరస్యపూర్వకంగా పరిష్కార చర్యలు చేపట్టాలని, ప్రతి నెలా సమీక్షలు నిర్వహించి పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు.కొత్తగా పోడు సాగు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, గతంలో పోడు సాగు చేసిన వారి సమస్యలను ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు.పాల్వంచ శ్రీనివాసగుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని మంత్రి ఆదేశించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేలా రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రీ–సర్వే పనులు దశలవారీగా కొనసాగుతున్నాయని, మిగిలిన గ్రామాల్లో కూడా గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, ఐటిడిఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జంగం మహేష్ స్వామి కి సన్మానించిన వీరశైవ సమాజం

**- చౌకీ మఠం సభ్యులు**



**సంగారెడ్డి, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన కార్యవర్గంలో సదాశివపేట వీరశైవ సమాజం చౌకీమఠం సభ్యులు జంగం మహేష్ స్వామి తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గా ఎన్నికైన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించినట్లు అధ్యక్షులు చీల మల్లన్న అన్నారు.వారు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గా ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన స్థానాలను అధిరోహించాలని అన్నారు.ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం మునుముందు మరిన్ని గొప్ప అవకాశాలు చేజిక్కించుకోవలని అన్నారు.సమాజ సభ్యులు అందరూ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో గౌరవ అధ్యక్షులు బోడగామ శ్రీ శైలం కోశాధికారి పులుమామిడి వీరేశం సమాజం సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక "బోనం"..

**-పలు సంఘాల బోనాల పండుగలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్...**





**నిజామాబాద్, నేటి శుభోదయ :**
తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ బోనాలు అని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని కోటగల్లిలో గల కట్ట మైసమ్మ ఆలయం,నాందేవ్ వాడ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆషాఢ మాసం తెలంగాణకు ప్రత్యేక మాసం అన్నారు.గ్రామ దేవతలకు పూజిస్తూ.. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని కొలిచే పండగ అన్నారు. బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదని,ఇది మన పూర్వీకుల సంప్రదాయాన్ని.. గ్రామదేవతల పట్ల ఉన్న విశ్వాసాన్ని తరతరాలకు అందించే ఆధ్యాత్మిక వేడుక అన్నారు.బోనం అంటే అమ్మవారికి సమర్పించే నైవేద్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు పాలు, బెల్లంతో వండిన అన్నాన్ని.. కొత్త కుండలో పెట్టి, వేపాకులు, పసుపు, కుంకుమలతో అలంకరించి తలపై మోసుకుంటూ అమ్మవారికి సమర్పిస్తారన్నారు. పోతురాజుల నృత్యాలు,ఘటం ఊరేగింపులు,రంగం వంటి సంప్రదాయాలు పండుగకు మరింత వైభవాన్ని తీసుకువస్తాయన్నారు.అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, కోటగల్లి మైసమ్మ ఆలయ ప్రతినిధులు దేవేందర్, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**సారపాక, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపడుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం సారపాకలోని ఐటీసీ గెస్ట్ హౌస్‌లో జిల్లాలో భూముల రీ-సర్వే ప్రగతి, అటవీ-రెవెన్యూ భూ సమస్యలు, పోడు భూముల అంశం, పాల్వంచ శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై ఆయన అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ జిల్లాలో సర్వే పనులు మరింత వేగంగా ముందుకు సాగాలని, ఎక్కడా జాప్యానికి తావులేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు కొనసాగుతుండగా, ఐదు గ్రామాల్లో సర్వే పూర్తయిందని అధికారులు వివరించారు. మిగిలిన గ్రామాల్లోనూ నిర్దేశిత కాలవ్యవధిలోగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వేయర్లు, రోవర్ పరికరాల కొరత రాకుండా అవసరమైన చోట అదనపు వనరులను సమకూర్చుకోవాలని ఆదేశించారు.

**సమన్వయంతోనే భూ సమస్యల పరిష్కారం**

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అటవీ-రెవెన్యూ భూ సమస్యలను సామరస్యపూర్వకంగా, చట్టబద్ధంగా పరిష్కరించేందుకు రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రతి నెలా సమీక్షా సమావేశాల ద్వారా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కొత్తగా పోడు సాగు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూనే గతంలో పోడు సాగు చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వ విధానాల ప్రకారం, మానవీయ కోణంలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.

**శ్రీనివాసగుట్టకు పర్యాటక శోభ**

పాల్వంచలోని శ్రీనివాసగుట్ట ప్రాంతాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. గుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేలా రహదారి నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన, డీఆర్ఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో పాలడుగు పల్లె దవాఖానా

### -ఐద్వా, వ్యకాస నాయకులు గుడిమెట్ల రజిత, బాణాల శ్రీనివాసరావు







**వైరా, నేటి శుభోదయ :** అనేక సమస్యలతో సతమతమవుతూ పాలడుగు పల్లె దవాఖాన జబ్బున పడిందని ఐద్వా, వ్యకాస నాయకులు గుడిమెట్ల రజిత, బాణాల శ్రీనివాసరావు, తూము సుధాకర్ విమర్శించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వైరా మండలం పాలడుగు గ్రామంలోని పల్లె దవాఖానా సమస్యలపై చేసిన సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఐద్వా వైరా డివిజన్ కార్యదర్శి గుడిమెట్ల రజిత, వ్యకాస మండల అద్యక్ష, కార్యదర్శులు బాణాల శ్రీనివాసరావు, తూము సుధాకర్ మాట్లాడుతూ పల్లె దవాఖానా బిల్డింగ్ శిథిలావస్థకు చేరిందని, వర్షం వస్తే బిల్డింగ్ కురుస్తుందని, కూలడానికి సిద్ధంగా ఉన్నదని, హాస్పిటల్ బిల్డింగ్ ఎప్పుడు కూలి పోతుందో అని సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. హాస్పిటల్లో బాత్ రూమ్స్ సరిగా లేవని, బాత్ రూమ్స్ లో నీళ్ళు రాక మహిళా సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, హాస్పిటల్ చుట్టూ ప్రక్కల పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయి అపరిశుభ్రంగా ఉన్నదని అన్నారు. హాస్పిటల్ నూతన బిల్డింగ్ నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డాక్టర్లు, సిబ్బందిని నియమించాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండి పని చేసే ఆశ వర్కర్లకు కనీస వేతనం 18000/- ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలని అన్నారు. సుగర్, బిపి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నామని, సీజనల్ వ్యాధులకు



కూడా మందులు ఇస్తున్నామని ఎఎన్ఎం బి. పద్మ సర్వే బృందానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా వైరా రూరల్ అధ్యక్షురాలు బాణాల వెంకట్రావమ్మ, ఐద్వా వైరా రూరల్ మాజి కార్యదర్శి షేక్. షేనాబి పాల్గొన్నారు.

# వేతనాలు పెంచకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం -ఎస్.ఎల్ పద్మ,ఎం.సుధాకర్

**నిజామాబాద్, నేటి శుభోదయ :** ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) నిజామాబాద్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యవక్తలుగా వచ్చిన యూనియన్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు ఎస్ఎల్ పద్మ,ఎం.సుధాకర్ లు మాట్లాడుతూ....విపరీతంగా పెరిగిన ధరలు,రోజురోజుకు పెరుగుతున్న పనిభారంతో కేజీబీవీ నాన్ టీచింగ్,వర్కర్లు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తీవ్రమైన పనిభారంతో అనారోగ్యాలకు గురవుతూ,ఉద్యోగాలు వదులుకుంటున్నారన్నారు.ఉద్యోగ భద్రత,ఆరోగ్య భద్రత,రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకపోవడం అన్యాయమన్నారు.విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా,సిబ్బంది సంఖ్య పెంచట్లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.కేజీబీవీ,యుఆర్ఎస్,మోడల్ స్కూల్ హాస్టల్స్ లో పనిచేస్తున్న నాన్ టీచింగ్,వర్కర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన కనీస వేతనాలు తక్షణమే అమలు చేయాలన్నారు.ఖాళీ పోస్టులతో,పని భారం విపరీతంగా పెరిగిందన్నారు.వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు.ఉద్యోగ,ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు.రిటైర్మెంట్ వయస్సు 65 సంవత్సరాలకు పెంచి,రిటైర్ అయిన వారికి 5లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు.నాన్ టీచింగ్ వర్కర్లకు నైట్ డ్యూటీ లను రద్దు చేయాలని,వీక్లీఆఫ్ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.మోడల్ స్కూల్ హాస్టల్స్ లో పనిచేస్తున్న సిబ్బందికి



కేజీబీవీ తరహాలోనే వేతనాలు ఇవ్వాలన్నారు.గత ప్రభుత్వం హయాంలో అన్యాయానికి గురైన వీరికి,మూడేళ్లుగా ఈ ప్రభుత్వం కూడా మొండి చేయి చూపుతుందని ఆగ్రహం వ్యక్తచేశారు.కేజీబీవీ నాన్ టీచింగ్,వర్కర్లకు వేతనాలు పెంచి,వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని,చలో హైదరాబాద్ నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎం.నరేందర్,యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హేమలత,సుమలత,రాష్ట్ర నాయకులు ఈశ్వరి,శశికళ,సునీత,జిల్లా ఉపాధ్యక్షులు సంధ్య,సుజాత,సహాయ కార్యదర్శి శోభ,జిల్లా నాయకులు సుమలత,జీవ,శాంతా,వివిధ కేజీబీవీ మోడల్ స్కూల్ హాస్టల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే కోరం కనకయ్య

**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ :** ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను తెలంగాణ శాసనసభ అంచనాల కమిటీ ( ఎస్టిమేట్స్ కమిటీ ) ఛైర్మన్‌గా నియమించారు. 2026–27 సంవత్సరానికి సంబంధించిన శాసనసభ కమిటీలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించగా, అంచనాల కమిటీకి కనకయ్యను ఛైర్మన్‌గా నియమించారు. ప్రభుత్వ శాఖల వ్యయ అంచనాలను పరిశీలించడం, నిధుల వినియోగాన్ని సమీక్షించడం, ప్రజాధనాన్ని సమర్థవంతంగా వినియోగించేలా ప్రభుత్వానికి సూచనలు చేయడం అంచనాల కమిటీ ప్రధాన బాధ్యతలు. ఈ కమిటీ ఛైర్మన్‌గా కోరం కనకయ్య నియామకం జిల్లాకు గౌరవకరమైన విషయమని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కనకయ్యకు



శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

# సర్ లో పాల్గొన్న 93 సంవత్సరాల సీతాభాయి



**ఖమ్మం, నేటి శుభోదయ** ఖమ్మం నగరంలో గల జిల్లా పరిషత్ వెనుక 41వ డివిజన్ జమ్మిబండ 172 పోలింగ్ కేంద్రం సంబంధించి సర్ ఫార్మ్‌ని స్వీకరిస్తున్న 93 ఏళ్ల కందిరాజు సీతా భాయి. ఈ కార్యక్రమంలో ఫార్మ్‌ని అందజేస్తున్న బిఎల్ఓ వెంకట రత్నమ్మ, ఎం డి తమన్నా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హతీరామ్ బావాజీ జయంతి వేడుకలు.




**ఏన్కూర్, నేటి శుభోదయ :**

ఏన్కూర్ మండల పరిధిలోని మూలపోచారం పంచాయతీ, రాంనగర్ తండాలోని బూడియా బాపూ దేవస్థానం నందు సేవాలాల్ సేన ఏన్కూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో శ్రీ గుగులోత్ అమృత్ రాజు సాధు, జిల్లా కో కన్వీనర్ ఇస్లావత్ చందు నాయక్ సమక్షంలో శ్రీ హతీరామ్ బావాజీ 597 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా కన్వీనర్ భుక్యా వినోద్ కుమార్ రాథోడ్ విశిష్ట అతిథిగా భోగ్ బండారో కార్యక్రమంలో పాల్గొన్నారు. హతీరామ్ బావాజీ జయంతి సందర్భంగా మహా భోగ్ బండారో కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన ఏన్కూర్ మండల అధ్యక్షుడు బోడ ప్రవీణ్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు ప్రవీణ్, రాంనగర్ తండా ప్రజలు, మండల బంజారా ముఖ్య నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల సాధనకు కదలాలి



**పాల్వంచ, నేటి శుభోదయ :**

గిరిజన హక్కుల సాధనకు, ఏజెన్సీ చట్టాల పరిరక్షణకు గిరిజన లోకం ఐక్యంగా కదలాల్సిన అవసరం ఉందని అఖిలభారత ఆదివాసి మహాసభ ఇంచార్జి అని రాజా పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సమాఖ్య (టీజీఎస్) రాష్ట్ర తృతీయ మహాసభల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్, అమరజీవి సోయం రంగులు నగర్, టాను నాయక్ ప్రాంగణంలో ఆదివారం అత్యంత ఉత్సాహంగా రెండో రోజు ప్రతినిధుల సభ జరిగింది. టీజీఎస్ పతాకాన్ని గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు కల్లూరు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాలకుల ప్రజావ్యతిరేక విధానాల వల్ల గిరిజన ప్రాంతాల్లో హక్కులు కాలరాయబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తరతరాలుగా అడవిని నమ్ముకుని బతుకుతున్న గిరిజన బిడ్డలను భూములకు దూరం చేసే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. పోడు సాగుదారులకు పూర్తి రక్షణ కల్పించే వరకు, గిరిజన సంక్షేమం సిద్ధించే వరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఐక్య ఉద్యమాలతోనే న్యాయం జరుగుతుంది.అణచివేత వైఖరిని వీడాలి.భూములపై నిర్బంధాలను అడ్డుకుంటాం.గిరిజన హక్కుల రక్షణకు సిద్ధమవ్వాల. ప్రజా పక్షాన పోరాటాలు సాగిస్తాం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుఐక్య ఉద్యమాలతోనే గిరిజన హక్కుల రక్షణ మరియు న్యాయం సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడుతూ పాలకుల అణచివేత వైఖరిని గిరిజన లోకం ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. గిరిజన భూములపై ఎలాంటి నిర్బంధాలను పెట్టినా సహించేది లేదని, అడవిపై సర్వహక్కులు గిరిజనులవేనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా పక్షాన ఉంటూ బలమైన ఉద్యమాలను నిర్మించి గిరిజన బిడ్డలకు పూర్తి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. గిరిజన సమాఖ్య బలోపేతం ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని రాష్ట్ర టీజీఎస్ ప్రధాన కార్యదర్శి అంజయ నాయక్ పేర్కొన్నారు. ప్రతినిధుల సభలో ఆయన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కాలంగా గిరిజన హక్కుల కోసం చేసిన ఉద్యమాలను, భవిష్యత్తు కార్యాచరణను నివేదికలో పొందుపరిచామన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పోడు భూముల పట్టాల పంపిణీని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, విద్యా, వైద్య రంగాల బలో పేతం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రవేశపెట్టిన నివేదికపై ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించి పలు అంశాలపై మహాస భలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

**పోలవరం పేరుతో ఆదివాసీల జల సమాధి :**
**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా**

పోలవరం ప్రాజెక్టు పేరుతో సుమారు రెండు లక్షల మంది ఆదివాసీలను జల సమాధి చేస్తున్నారని తరతరాలుగా అడవిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న అమాయకులను అభివృద్ధి పేరుతో అడవుల నుండి దూరం చేసి సహజ వనరులను కొల్లగొట్టేందుకు పాలకలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గిరిజన నాయకులు స్వయం గంగులు తాను నాయక్ వారసత్వాన్ని పునికి పుచ్చుకొని గిరిజన హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామ్మూర్తి నాయక్ అంజయ్య నాయక్ సిపిఐ టిజిఎస్ నాయకులు ముత్యాల విశ్వనాథం మేయర్ మూడ్ గణేష్ నరాటి ప్రసాద్ సలిగంటి శ్రీనివాస్ కంచర్ల జమలయ్య వి పూర్ణచంద్రరావు అడుసుమిల్లి సాయిబాబా భూక్య దశ్రు ఉప్పు శెట్టి రాహుల్ భూక్య శ్రీనివాస్ సోందే కుటుంబరావు వెంకట్ రాష్ట్ర జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యం - భట్టి విక్రమార్క





**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ :**
ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా ఇల్లందు మండలం రొంపేడు గ్రామంలో రూ.3.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేసి, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ వద్ద నూతన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని తెలిపారు. 1912 టోల్‌ఫ్రీ సేవలు, రాష్ట్రవ్యాప్తంగా 165 పవర్ అంబులెన్స్‌ల ద్వారా విద్యుత్ సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. సింగరేణి అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ కొత్త ఉప కేంద్రాలతో విద్యుత్ సరఫరా మరింత బలోపేతమై వినియోగదారులకు మెరుగైన సేవలు అందనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎస్పీ రోహిత్ రాజు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎమ్మెల్యే రామదాస్ నాయక్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జల్లేపల్లిలో ఘనంగా వరద పాశం పండుగ





**తిరుమలాయపాలెం, నేటి శుభోదయ :**
ఆషాడ మాసంలో ప్రతి ఏడు నిర్వహించే విధంగా ముదిరాజుల వరద పాశం పండుగ తిరుమలాయపాలెం మండల పరిధిలోని జల్లెపల్లి గ్రామంలో ఆదివారం నాడు ముదిరాజులు అత్యంత వైభవంగా పండుగను కిలాయిగుట్ట ప్రాంతంలో నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ముదిరాజు కుల పెద్దలు సాంప్రదాయ పూజా పద్ధతులతో గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, పండ్లు, పువ్వులతో నైవేద్యం సమర్పించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు,కుంటలు, బావులు నిండాలని, పంటలు బాగా పండాలనీ, చేపల సంపద పెరగాలని, గ్రామంలో అందరూ పిల్లపాపలతో ఆరోగ్యంగా, ఐశ్వర్యంతో ఉండాలని,ఐక్యత శాంతి నెలకొనాలని వారు దేవతలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అన్నెపర్తి రవి, మండల కాంగ్రెస్ నాయకులు పోట్ల కిరణ్ కుమార్, కుల పెద్దలు దడుదల వెంకటేశ్వర్లు, మత్స్యశాఖ సభ్యులు దడిదల అశోక్, తురక వేణు, రవి, మల్లయ్య, నాగేందర్ , హరీష్, మధు, రాజబాబు,తదితరులు పాల్గొన్నారు.

## పదవి ఉన్నా లేకున్నా.. పాలేరు గుండెల్లో ఆయనే లీడర్



**ఖమ్మం, నేటి శుభోదయ :**
పదవులు రావచ్చు, పోవచ్చు.కానీ జనాల గుండెల్లో సంపాదించుకున్న స్థానం ఎప్పటికీ చెరిగిపోదు. మాట ఇస్తే వెనకడుగు వేయడు, జనం ఆపదలో ఉంటే చూస్తూ ఊరుకోడు. ఫోన్ చేస్తే సామాన్య కార్యకర్త పేరు గుర్తుంచుకొని లిఫ్ట్ చేస్తాడు. పాలేరు ప్రజలు ఎవరు చేసిన ఫోన్ ఎత్తి సామాన్య మనిషిలాగ అప్పుడు ఇప్పుడు మాట్లాడుతూనే ఉన్నారు రైతుకు అండగా, పేదవాడికి నీడగా నిలిచిన మనసున్న నాయకుడే కందాళ ఉపేందర్ రెడ్డి. రైతు బిడ్డల కోసం, సొంత డబ్బుతో రైతు వేదికను ఏర్పాటు చేశారు. పేద విద్యార్థుల కోసం, లక్షల్లో ఫీజు సాయం చేశారు. అనారోగ్యంతో ఉన్నోడి కోసం, సొంత ఖర్చుతో కార్పొరేట్ వైద్యం అందించారు. "అడిగింది లేదనడు, లేదంది ఉండనడు"ఇది స్లోగన్ కాదు. ఆయన నైజం. కష్టమొస్తే "నేనున్నానంటూ" ముందుండే మన పాలేరు ధీరుడు. పాలేరు మాజీ శాసనసభ్యులు "కందాళ ఉపేందర్ రెడ్డి. ప్రజా సేవలోనే ఆయన మార్గం, చనిపోయిన ప్రతి కుటుంబానికి రూ 10,000 ల ఆర్థిక సహాయం అందించి ఓదార్చే మంచి మనసున్న నాయకుడు. పదవిలో ఉన్నా లేకున్నా, పాలేరు గుండె చప్పుడు కందాళ ఉపేందర్ రెడ్డి అని చెప్పక తప్పదు మరి.

## గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం - ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి



**నిజామాబాద్, నేటి శుభోదయ :**
గ్రామాల సమగ్ర అభివృద్ధి,ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని,గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం నిజామాబాద్ రూరల్ మండలం గుండారంలో సబ్ సెంటర్ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు,రెడ్డి సంఘం భవనం కాంపౌండ్ వాల్ కు రూ.5 లక్షలు నిధులు మంజూరు ఇచ్చారు.ఈ మేరకు ఆ గ్రామ రెడ్డి సంఘం ప్రతినిధులకు ప్రొసీడింగ్స్ అందజేశారు.పార్టీ సీనియర్ నాయకులు బాగారెడ్డి ఉన్నారు.అటు మండలంలోని కొత్తపేట్ గ్రామ అభివృద్ధి కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధుల కింద రూ.10లక్షల విలువైన ప్రొసీడింగ్ పత్రాలను కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఎల్లయ్య గ్రామ సర్పంచ్ శ్రీధర్ గౌడ్,గ్రామ పెద్దలకు ఎమ్మెల్యే అందజేశారు.ఇందులో ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో సిసి డ్రెయిన్స్ కు రూ.5 లక్షలు,సోముల్ నాయక్ తాండాలో జగదాంబ ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.5 లక్షల నిధులకు సంబంధించిన పనులు ఉన్నాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....గ్రామ అభివృద్ధికి ఇప్పటికే లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని,రెండో విడతలో మరిన్ని అర్హులకు ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన,దేవాలయాలు,సామాజిక భవనాల అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజల సహకారంతో ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగిస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు,నాయకులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు నీటి హక్కులు కల్పించాలి - ముకుంద నాగేశ్వర్



**వికారాబాద్, నేటి శుభోదయ :**
ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజల నీటి హక్కులను గత ప్రభుత్వాలు, కొందరు ఇంజనీర్లు మరియు రిటైర్ ఇంజనీర్ల ఫోరం నిర్లక్ష్యం చేశాయని బీజేపీ నాయకుడు ముకుంద నాగేశ్వర్ ఆరోపించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కాలేశ్వరం ప్రాజెక్టుగా మార్చడం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జూరాల ఫ్లడ్ వాటర్‌కు బదులుగా శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా రీడిజైన్ చేయడం వల్ల ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు అన్యాయం జరిగిందన్నారు.2008లో కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పూర్తయి ఉంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుమారు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. అలాగే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మొదటి ప్రతిపాదనల ప్రకారం అమలు చేసి ఉంటే మరో మూడు లక్షల ఎకరాలకు నీరు అందే అవకాశముండేదని తెలిపారు. దీంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలు కూడా దీర్ఘకాలికంగా తీరేవని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు కృష్ణా, గోదావరి జలాలు అందకపోవడం వల్ల భూగర్భ జలాల మట్టం క్రమంగా పడిపోతోందని, భవిష్యత్తులో హైదరాబాద్ నగరం కూడా తీవ్రమైన నీటి సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం పేరుతో కొందరు ఇంజనీర్లు ఇప్పటికే సాగునీరు అందుతున్న ప్రాంతాలకే మరింత నీటిని మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు ఒక్క ఎకరాకు కూడా కృష్ణా, గోదావరి జలాలు అందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా ప్రాణహిత –చేవెళ్ల, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నీటి పంపిణీ విధానాలను అమలు చేయాలని ఆయన కోరారు.

## రాకేష్ రెడ్డి ఇంటి కి ఒక్క కాంగ్రెస్ నాయకులు వస్తే వేల మంది బీజేపీ నాయకులు




**నిజామాబాద్, నేటి శుభోదయ :**
చలో అంకాపూర్ కి మేము కూడా సిద్ధం..కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయినందుకు మా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని కొంత మంది కాంగ్రెస్ నాయకులు పోస్టులు విడుదల చేయడం సిగ్గుచేటు!మేము కూడా చలో అంకాపూర్ రావడానికి బిజెపి కార్యకర్తలు ప్రతి ఒక్క ఇందూరు హిందూ బంధువులు సిద్ధం రేపు జరగబోయే పరిణామాలు ఎటువంటివి అయినా కూడా దానికి పూర్తి బాధ్యత పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కారణమవుతారు.అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న రాకేష్ రెడ్డిని ఇంటి ముట్టడించే ముందు అధికార పార్టీ ఎమ్మెల్యేల ఇంటిని ముట్టడిస్తామని దినేష్ ధ్వజమెత్తారు..200 కోట్ల తోనీ యంగ్ ఇండియా ఇంటికి స్కూలు ప్రారంభించి పనులను త్వరగా పూర్తి చేపిస్తున్న ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఇల్లు ముట్టడిస్తారా?ఆర్మూర్ నియోజకవర్గంలో 92 గ్రామాలకు 3000 ఇండ్లు మంజూరు చేసినందుకు ఇల్లు ముట్టడిస్తారా?45 కోట్ల రూపాయలతో అడ్వాన్స్ టెక్నాలజీ ఆర్మూర్ మున్సిపాలిటీకి ఇచ్చినందుకు ఇల్లు ముట్టడిస్తారా?తెలంగాణ అసెంబ్లీలో గల్ఫ్ కార్మికుల కోసం గొంతు ఎత్తి చనిపోయిన కుటుంబ సభ్యులకు 5లక్షల ఇప్పించినందుకు ఇల్లు ముట్టడిస్తారా?కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన అమృత స్కీం కింద 43 కోట్లు మంజూరు చేయించినందుకు ఇల్లు ముట్టడిస్తారా?డొంకేశ్వర్ మండలం ఎమ్మార్వో ఆఫీస్ బిల్డింగు మంజూరు చేసినందుకు ఇల్లు ముట్టడిస్తారా?ఒక రూపాయి అవినీతి చేయకుండా సుమారు 700 కోట్ల అభివృద్ధి పనులను ఆర్మూర్ ప్రజల కోసం విడుదల చేయించిన రాకేష్ రెడ్డి ఇంటి ముట్టడించడం సిగ్గుచేటు ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలి కాంగ్రెస్ నాయకులు.ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ 30 నెలలు గడుస్తున్న ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు అని జిల్లా అధ్యక్షుడు దినేష్ ప్రశ్నించారు?....రాకేష్ రెడ్డి ఇంటి కి ఒక్క కాంగ్రెస్ నాయకులు వస్తే వేల మంది బీజేపీ నాయకులు,కార్యకర్తలు మహేష్ కుమార్ గౌడ్,ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి,రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని దినేష్ పిలుపునిచ్చారు....ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గద్దె భూమన్న,ప్రధాన కార్యదర్శి పోతంగర్ లక్ష్మీనారాయణ,నాగోల లక్ష్మీ నారాయణ,కార్పొరేటర్లు యాదాల నరేష్,జ్యోతి,ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షుడు ఓంసింగ్,రూరల్ మండల అధ్యక్షుడు ఆనంద్,సంతోష్,నాయకులు పాల్గొన్నారు.

## ఐక్య ఉద్యమాలతోనే గిరిజన హక్కులకు రక్షణ

### -నరేంద్ర మోడీ పాలనలో గిరిజన హక్కులకు ప్రమాదం



**పాల్వంచ, నేటి శుభోదయ :**
తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్ ) రాష్ట్ర 3వ మహాసభలు పాల్వంచ పట్టణంలో ఆదివారం రెండో రోజు ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి భూక్యా వీరభద్రం సంఘీభావ సందేశం అందిస్తూ మాట్లాడారు.దేశవ్యాప్తంగా గిరిజనుల రాజ్యాంగబద్ధమైన హక్కులు, అటవీ హక్కులు, భూమి హక్కులు, స్వయం పాలనా హక్కులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడులు కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. గిరిజనుల జీవనోపాధి, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు అన్ని గిరిజన సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల భూముల రక్షణ, విద్య, ఉపాధి, ఆరోగ్యం, గృహాలు, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. హామీలు అమలు కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులను సమీకరించి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ మహాసభలకు సీపీఐ జాతీయ కార్యదర్శి, ఆదివాసీ మహాసభ ఇన్‌చార్జి డాక్టర్ అని రాజా, కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రామ్మూర్తి నాయక్, తెలంగాణ గిరిజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ వాంకుడోత్ అమర్ సింగ్ నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య భద్రాది కొత్తగూడెం జిల్లా కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు,కొత్తగూడెం నగర మేయర్ మూడ్ గణేష్ నాయక్, బానోతు జగన్నాథం, బానోత్ రాంమూర్తి, అజ్మీరా హరి తదితరులు పాల్గొన్నారు.తెలంగాణలో గిరిజనుల హక్కుల సాధన, సంక్షేమం, అభివృద్ధి కోసం ఐక్య పోరాటాలే మార్గమని మహాసభ లో భూక్యా వీరభద్రం పిలుపునిచ్చింది.

# 15 ఏళ్ల స్మశాన వాటిక వివాదానికి తెర..

## గౌడ సంఘానికి న్యాయం...



**నేరేడ్ మెట్, నేటి శుభోదయ :** ఓల్డ్ నేరేడుమెట్ గౌడ సంఘానికి చెందిన స్మశాన వాటిక స్థలం విషయంలో గత పదిహేనేళ్లుగా కొన సాగుతున్న న్యాయపోరాటానికి ఎట్టకేలకు ముగింపు లభించింది. న్యాయస్థానం గౌడ సంఘానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో, ఆ తీర్పు అమలుకు స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో స్మశాన వాటిక స్థలాన్ని గౌడ సంఘానిదిగానే గుర్తిస్తూ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ అధికారిక ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీంతో దశాబ్ద కాలానికి పైగా నెలకొన్న అనిశ్చితికి తెరపడటంతో గౌడ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారమే ప్రజా ప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అమలులో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి గౌడ సంఘానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గౌడ సంఘానికి చెందిన స్మశాన వాటిక స్థలంపై ఇకపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన రక్షణ చర్యలు కూడా తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు న్యాయం జరిగే ప్రతి అంశంలో తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు.మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్ మాట్లాడుతూ, స్మశాన వాటిక స్థలం విషయంలో గౌడ సంఘం సభ్యులు పదిహేనేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఎన్నోసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం లభించలేదని, చివరకు న్యాయస్థానం తీర్పు వచ్చిన అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు వెంటనే జోనల్ కమిషనర్‌ను కలిసి కోర్టు తీర్పు ప్రతులను అందజేయడంతో అధికారులు సానుకూలంగా స్పందించి ప్రొసీడింగ్స్ జారీ చేశారని తెలిపారు. ఈ విజయానికి ఎమ్మెల్యే అందించిన సహకారం మరువలేనిదని అన్నారు.జోనల్ కమిషనర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్ పత్రాలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో గౌడ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు, మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం పెద్దలు మాట్లాడుతూ, కోర్టు కేసు ప్రారంభమైన నాటి నుంచి ప్రతి దశలో తమకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ న్యాయం జరిగేలా కృషి చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి, సమస్య పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కోర్టు తీర్పు, అధికారిక ప్రొసీడింగ్స్ జారీ కావడంతో సుమారు వంద గౌడ కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్‌లను ఘనంగా సన్మానించి తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్, గౌడ సంఘం పెద్దలు టి.వి. నరేందర్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, పవన్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, జే.కే. సాయి గౌడ్, విశ్వనాథ్ గౌడ్, అభిషేక్ గౌడ్, జహంగీర్ గౌడ్, గిరి గౌడ్, గంగాధర్ గౌడ్, వినోద్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనార్ధన్, కోటేశ్వర్, శ్రీకాంత్ గౌడ్, శ్రీధర్ గౌడ్‌తో పాటు గౌడ సంఘానికి చెందిన పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

# కుమ్మర్ల బోనాల పండుగ లో పాల్గొన్న డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి





**సంగారెడ్డి , నేటి శుభోదయ** అశాడ మాసం సందర్భంగా సంగారెడ్డి పట్టణం లో బోనాల ఉత్సవాలు మొదలయ్యాయి. ఆనవాయితీగా ఎఫ్అర్ఎస్ ఎల్లమ్మ తల్లి కి కుమ్మర్లు తొలి బోనం సమర్పించారు. ఐబి నుండి మొదలుకుని ఎల్లమ్మ గుడి వరకు బోనాలను ఊరేగించారు. డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఈ బోనాల ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆశాడమాసం అత్యంత పవిత్రమైన మాసం అన్నారు. ఆశాడ మాసం సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించడం తరతరాలుగా వస్తున్న ఆచారం అన్నారు.ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ లు శైలేష్ రెడ్డి, కృష్ణ, అశ్విన్, కాంగ్రెస్ నాయకుడు శ్రీశైలం, కుమ్మరి సంఘం పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# పిండిప్రోలు హత్యా ఉదంతం



**సంగారెడ్డి, నేటి శుభోదయ :** తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న దారుణ హత్య ఉదంతం పై స్థానిక శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నగల కోసం వృద్ధురాలైన సుగుణమ్మను దొంగలు అత్యంత ఘోరంగా గొంతుకోసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఆదివారం పిండిప్రోలు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె భర్త చెన్నా జనార్ధన్, కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామంలో స్థానిక ప్రజలతో మరియు నాయకులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను, అక్కడి భయాందోళనలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.--- పోలీస్ కమిషనర్‌కు లేఖ ఈ ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నిన్నటి రోజునే (శనివారం) ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ కి అధికారికంగా లేఖ రాశారు. పిండిప్రోలు తన సొంత గ్రామం అయినందున, ఈ దారుణ ఘటనతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు.ఈ కేసుకు సంబంధించి తక్షణమే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి, నిందితులను వీలైనంత త్వరగా పట్టుకోవాలని సీపీ ని కోరారు. ఇలాంటి ఘోరాలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేందుకు గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి పూట పెట్రోలింగ్‌ను తీవ్రతరం చేయాలని, ఆయన లేఖ ద్వారా డిమాండ్ చేశారు. నిందితులకు కఠినమైన శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చామకూరి రాజ్ కుమార్, గ్రామ పెద్దలు చామకూరి వెంకన్న, చామకూరి సునీల్ చిట్టి, చామకూరి కిరణ్, వార్డ్ నెంబర్ పసలది ముత్తయ్య, చామకూరి కృష్ణయ్య , ఊడుగుల బిక్షం, టిఆర్ఎస్ మండల నాయకులు బిల్లగిరి ధనంజయ, బి ఆర్ ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు గుంటి పుల్లయ్య బిల్లగిరి వెంకటేశ్వర్లు పగిడిపల్లి బాబు వంగూరి బాబు ఏళ్లే కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# భవసార క్షత్రియ సమాజ్ అధ్యక్షునిగా చంద్రశేఖర్ వాదోనే ఎన్నిక



**సంగారెడ్డి, నేటి శుభోదయ :** సదాశివపేటహాట్కరిపేట లోని శ్రీ భవాని భవ సార్ క్షత్రియ సమాధి అధ్యక్షునిగా చంద్రశేఖర్ వాదోని ఎన్నిక కావడం జరిగింది. ఆదివారం నాడు ఆలయ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించుకొని అందరి సభ్యుల కోరిక మేరకు పాత కార్యవర్గాన్ని రెండోసారి కొనసాగించుటకు ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు చంద్రశేఖర్ వాదోనే మాట్లాడుతూ తనపై నమ్మకం ఏర్పరచుకొని కమిటీ సభ్యులందరూ తనను రెండవసారి ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆలయ అభివృద్ధి మేరకు కృషి చేస్తానన్నారు.ఆలయ కమిటీ సభ్యులు గౌరవ అధ్యక్షులుగా రమేష్ గణాతే, కార్యదర్శి అర్జున్ రావు దాండిగే, ఉపాధ్యక్షులు త్రియంబర్ లెండాలే, దయానంద్ దుమాలే, నరేందర్ దాండిగే, సంజీవ్ మహేందర్కర్, సంయుక్త కార్యదర్శులు రాజు పతంగే, శ్రీనివాస్ మహేందర్, కార్యనిర్వాకులు తులసీదాస్ మహేందర్కర్, మాణిక్ రావు లేండాలే, కోశాధికారి రవీందర్ దుమాలే, ముఖ్య సలహాదారులు తులసీదాస్ మహేందర్కర్, పాండు మహేందర్కర్, కృష్ణ గణాతే, సత్యనారాయణ లేండాలే, కార్యవర్గ సభ్యులు అమర్నాథ్ దుమాలే, ఈశ్వర్ దౌలాగర్, రవి పెన్కర్, నాగేశ్వరరావు గర్నే, రాజు మహేందర్కర్, దయానంద్ దేవులే, మాణిక్ మహేందర్, ప్రకాష్ మహేందర్కర్, ప్రకాష్ రావు దాండిగే, సురేష్ మహేందర్కర్, హరికృష్ణ కలేకర్, నర్సింగ్ ఓంకారే, అభినయ్ దౌలాగర్, తులసి దాస్ దాండిగే, మల్లేశ్వర్ మహేందర్కర్, ఉమేష్ హిర్వే, అనిల్ మహేందర్కర్, నాగేష్ దౌలాగర్, కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

# అంగరంగ వైభవంగా శాలివాహన బోనాలు..

## ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, సునీత లక్ష్మారెడ్డి



**సంగారెడ్డి, నేటి శుభోదయ :** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో శాలివాహన బోనాల మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం బోనాల ఊరేగింపులో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తి, శ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.సంగారెడ్డి ఐబీ నుంచి కొనసాగిన బోనాల ఊరేగింపు అస్తబల్‌లోని అమ్మవారికి బోనాలు సమర్పించారు.ఈ సందర్భంగా శాలివాహన బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, సునీత లక్ష్మారెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, చింత సాయినాథ్, శ్రీధర్ రెడ్డి, రామప్ప, జలేందర్, అంజద్, వాజిద్‌తో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి జీవిత కాల సాఫల్య పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు




**సంగారెడ్డి, నేటి శుభోదయ :** విద్యా, సామాజిక, పర్యావరణ రంగాలలో విశిష్ట సేవలందించిన సదాశివపేట మండల విద్యాధికారి ఎన్.శంకర్ మరియు నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ గార్లకు ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి జీవిత కాల సాఫల్య పురస్కారాలు లభించాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో, చైర్మన్ శ్రీమతి కమలా మనోహర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన "జాతీయ విద్యావేత్తల విశిష్ట పురస్కారాలు 2026" ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథి, ప్రముఖ చలన చిత్ర నటుడు పృథ్వీరాజ్ చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఎన్. శంకర్ మండల విద్యాభివృద్ధికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు చేసిన కృషిని కొనియాడారు. అలాగే ప్రధానోపాధ్యాయులు పోట్రు.రామ కృష్ణ ప్రాథమిక విద్య బలోపేతం,విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించడం,నూతన బోధనా పద్ధతులు,పర్యావరణం, సామాజిక సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, కృష్ణవేణి, రమాదేవి,పూజ సుజాత తదితరులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి జీవిత కాల సాఫల్య పురస్కారాలు అందుకున్న మండల విద్యాధికారి ఎన్. శంకర్ మరియు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ లను పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పూర్వ విద్యార్థులు హృదయపూర్వకంగా అభినందించారు.

# ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్లో విజయం సాధించి..

## న్యాయవాదిగా ఎంపికైన మధుసూదన్



**నేలకొండపల్లి, నేటి శుభోదయ :** మిడ్జిల్ మండలానికి చెందిన పంజం మధుసూదన్ ప్రతిష్ఠాత్మక ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ (AIBE)లో ఉత్తీర్ణత సాధించి న్యాయవాదిగా అర్హత పొందారు.ఇండియన్ బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్‌గా నమోదు కావడంతో మండలానికి గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానికులు ఆయనకు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## షాబాద్ మండల ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా మందుగుల మాణిక్యం ఏకగ్రీవ ఎన్నిక



**షాబాద్, నేటి శుభోదయ :** షాబాద్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అవిశిపేట ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఉప సర్పంచుల ప్రత్యేక అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అవిశిపేట ఆంజనేయులు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు.మండలంలోని ఉప సర్పంచులందరి ఏకాభిప్రాయంతో ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా షాబాద్ మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీలో అధ్యక్షుడిగా మందుగుల మాణిక్యం, ఉపాధ్యక్షులుగా చాకలి శ్రీశైలం, సంతమొల్ల మహేందర్, ప్రధాన కార్యదర్శిగా బేగరి యాదగిరి, కోశాధికారిగా వేముల విష్ణువర్ధన్ రెడ్డి, కార్యదర్శులుగా సిద్దాపురం శివకుమార్, ధోనూరు సక్కుబాయి, కార్యవర్గ సభ్యులుగా దదే రేణుక, మిద్దె హరీష్, బేగరి శెంకరయ్య, సలహాదారుగా బుగ్గ రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అవిశిపేట ఆంజనేయులు గౌడ్ నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచుల పాత్ర అత్యంత కీలకమైందని, అందరూ ఐక్యమత్యంతో పనిచేస్తూ ఉప సర్పంచుల హక్కుల సాధనతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో షాబాద్ మండలంలోని పలువురు ఉప సర్పంచులు పాల్గొన్నారు.

## కామేపల్లి మండలంలో అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు శ్రీకారం



**ఖమ్మం,కామేపల్లి, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అడవి మద్దులపల్లి గ్రామంలో రూ. 2.85 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ ఉపకేంద్రం ద్వారా ప్రాంత ప్రజలకు మరింత నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందే అవకాశం కలగనుంది.అనంతరం రూ. 3.95 కోట్ల వ్యయంతో తాళ్లగూడెం నుంచి నర్సయ్యకుంట వరకు (యం.పి.పి.యస్. పాఠశాల మీదుగా) చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అలాగే రూ.5 కోట్ల అంచనా వ్యయంతో ఇల్లందు ఆర్&బీ రోడ్డు నుంచి కామేపల్లి స్మశాన వాటిక వరకు కామేపల్లి పెద్ద చెరువు మీదుగా నిర్మించనున్న బీటీ రహదారి పనులను ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా విద్యుత్, రహదారి మౌళిక సదుపాయాలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, టీజీ ఎన్పిడిసిఎల్ ఎండి వరుణ్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీజీ ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, సిఇ రాజు చౌహాన్, ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాస చారి, పీఆర్ ఎస్ఇ జి. వెంకట్ రెడ్డి, ఇఇ మహేష్ బాబు, కామేపల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు



**మంథని / జనగాం, నేటి శుభోదయ :** జనగాం జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో స్థానిక శాసనసభ్యులు కడియం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)పై ప్రత్యేక సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సార్ కార్యక్రమం విజయవంతానికి పార్టీ నాయకులు, బిఎల్ఏ లు సమన్వయంతో పనిచేయాలన్నారు.

# జాడలేని వాన

### - దోబూచులాడుతున్న మేఘాలు - ఆందోళన లో అన్నదాతలు.







**ఏన్కూర్, నేటి శుభోదయ :** తెలంగాణ వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఖరీఫ్ ప్రారంభమైనప్పటికీ వానలు ముఖం చాటు వేయడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎండ తీవ్రతకు పత్తి మొక్కలు వాడిపోతున్నాయి .కొన్ని ప్రాంతాలలో విత్తనాలు వేసిన తర్వాత చినుకు జాడ లేకపోవడంతో రైతులు ట్యాంకర్ల ద్వారా పత్తి మొక్కల కు నీరు పోసే ప్రయత్నం చేస్తున్నారు. ఎల్ నినో ప్రభావంతో ఖరీఫ్ పై నీలి నీడలు కమ్ముకున్నాయి. వాన కోసం ఆకాశం వైపు చూస్తున్న రైతులు ప్రత్యామ్నాయ పంటలే పరిష్కారమే అనే స్థితికి వచ్చారు. ఆషాడ మాసం గడుస్తున్నప్పటికీ ఆశించిన వానలు లేకపోవడంతో రైతులు, కూలీలు ఆందోళనలో మునిగిపోయారు. ఆకాశంలో మేఘాలు కమ్ముకుంటున్నాయి తప్ప చినుకు జాడలేదు.మరోవైపు ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందిని వాతావరణ, వ్యవసాయ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆరుతడి పంటలకే రైతులు మొగ్గు చూపాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కూలీలు పనులు లేక ఇంటి దగ్గరే ఉంటున్న పరిస్థితి నెలకొంది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు.వాన లేకపోవడంతో వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి గ్రామాలలో సాంప్రదాయ పద్ధతులు పూజలు నిర్వహిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ గడిచిపోతూ ఉండటంతో రైతులు కూలీలు దిగులు చెందుతున్నారు.

వ్యవసాయ అధికారులు మొదటి నుంచి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని చెబుతున్నప్పటికీ రైతులు లెక్కచేయక వాణిజ్య పంటలు సాగు చేశారు. వాతావరణ పరిస్థితి ప్రభుత్వానికి, రైతాంగానికి,వ్యవసాయ శాఖకు క్లిష్టమైన పరిస్థితి . పలు గ్రామాలలో వ్యవసాయ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రత్యామ్నాయ వైపు పంటలు వేసుకోవాలని కోరుతున్నారు. పెట్టిన పెట్టుబడి మొత్తం వృధా అవుతుందేమోనని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇదే రీతిలో వానలు లేకపోతే భూగర్భ జలాలు అడుగంటిపోయి త్రాగునీరు సాగునీరు సమస్య తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉంది. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని కోరుతున్నారు.వానదేవుడు కరుణిస్తే రైతులు,కూలీలు కళకళలాడతారు లేదంటే ఈ ఏడాది కష్టాలు తప్పవని అభిప్రాయపడుతున్నారు.

## ప్రత్యామ్నాయ పౌర సమాజం నిరసన



**ఖమ్మం, నేటి శుభోదయ :** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవి కి రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వమే అతన్ని క్యాబినెట్ నుంచి తొలగించాలని ప్రత్యామ్నాయ పౌర సమూహ వేదిక కోరింది. అనేక మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులు పడ్డ నేపథ్యంలో విద్యామంత్రి రాజీనామా చేయనందుకు నిరసనగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మెగాససే అవార్డు గ్రహీత పర్యావరణవేత్త సాంకేతిక నిపుణుడు సోనం వాంగ్చుక్ గత 22 రోజులుగా ఆమరణ నిరాహార దీక్షను చేస్తున్నఅతన్ని అక్రమంగా అరెస్టు చేసి హాస్పటల్లో బంధించడాన్నీ సి సి ఏ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసన గా ఖమ్మం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వివిధ రాజకీయ పార్టీల వారు ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు, విద్యార్థులు యువకులు మేధావులు పెద్ద ఎత్తున వరంగల్ క్రాస్ రోడ్ సెంటర్ నుండి కేబుల్ బ్రిడ్జి వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, ఐ వి రమణారావు, రవి మారుతి, కాకి భాస్కర్, కిషోర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యానారాయణ గౌడ్, సిపిఐ జిల్లా నాయకులు దండి సురేష్ ,శేషగిరి , సురేందర్, బషీర్ , సుదర్శన్ రెడ్డి సిపిఎం నాయకులు, బందెల వెంకయ్య, రమేష్ మాస్ లైన్ నాయకులు మహబూబ్ అలీ బిఆర్ఎస్ నాయకులు ఉడుగు వెంకటేశ్వరరావు , పెరుమాళ్ళపల్లి శ్రీనివాసులు, శోభన్ , ధరావత్ రాములు, సాయిబాబా, దేవయ్య, కిషన్ నాయక్ ఈటిపి డబ్లూఏ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 104 ఏళ్ల వృద్ధురాలి కన్నీటి విజ్ఞప్తి

### - ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి, అయినా దక్కని న్యాయం



**ఖమ్మం , నేటి శుభోదయ :** ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన 104 ఏళ్ల వెలుతురు భద్రమ్మ తన కుటుంబ వారసత్వ భూమిని తిరిగి ఇప్పించాలని కోరుతూ ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో భావోద్వేగానికి గురయ్యారు. తన భర్త వెలుతురు చిన్న వెంకయ్య 1965లో కొనుగోలు చేసిన సర్వే నంబర్–310లోని భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేసి, దొంగ పత్రాల ఆధారంగా తమదేనంటూ హక్కు చెలాయిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ సందర్భంగా భద్రమ్మ కుటుంబ సభ్యులు 1965 నాటి కొనుగోలు పత్రాలు, సర్వే రికార్డులు, వారసత్వ ధ్రువపత్రాలు, ఇతర సంబంధిత ఆధారాలను విలేకరుల ఎదుట ప్రదర్శించి, వాటి ప్రతులను మీడియా ప్రతినిధులకు అందజేశారు. తమ వద్ద ఉన్న పత్రాలన్నీ చట్టబద్ధమైనవేనని, అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. భద్రమ్మ మనవడు వెలుతురు వీరకుమార్ మాట్లాడుతూ తన తండ్రి అనారోగ్యంతో మరణించిన తర్వాత కుటుంబ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు భూమిని అక్రమంగా తమ పేర్లకు మార్చుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం దొంగ పత్రాలు చూపిస్తూ భూమిని ఆక్రమించుకుని, తాము భూమి వద్దకు వెళ్లిన ప్రతిసారి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూ వివాదంపై ఇప్పటికే రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో భద్రమ్మ కుటుంబ సభ్యులు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. వృద్ధురాలి పరిస్థితిని స్వయంగా మంత్రికి వివరించి, 1965 నాటి కొనుగోలు పత్రాలు, వారసత్వ ఆధారాలను చూపించినట్లు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి సంబంధిత రెవెన్యూ అధికారులకు విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు సమస్యకు పూర్తి పరిష్కారం లభించలేదని, అందుకే మరోసారి మీడియా ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా వెలుతురు భద్రమ్మ కన్నీటి పర్యంతమై మాట్లాడుతూ, "నా కొడుకుని పోగొట్టుకున్నాను. ఇప్పుడు నా మనవళ్లను కూడా పోగొట్టుకునే పరిస్థితి రావొద్దు. నాకు 104 ఏళ్లు. నడవడమే కష్టంగా ఉంది. ఈ వయసులో కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని కూడా కలిసి మా గోడు చెప్పాం. ప్రజాదర్బార్‌లో వినతిపత్రం ఇచ్చాం. అధికారులు న్యాయం చేస్తారని ఎదురుచూస్తున్నాం. నా ప్రాణం ఉన్నప్పుడే మా భూమి మాకు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి" అంటూ వేడుకున్నారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు సర్వే నంబర్–310 భూమిపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలు వెలికితీసి అక్రమ కబ్జాదారుల నుంచి తమ భూమిని తిరిగి అప్పగించాలని భద్రమ్మ కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. 104 ఏళ్ల వయసులోనూ న్యాయం కోసం ఒక వృద్ధురాలు చేస్తున్న ఈ పోరాటం.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# న్యాక్ సెంటర్ ను ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలే...



**మంథని, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్రంలోనే అద్భుతం సృష్టించినట్లుగా గొప్పగా ప్రచారం చేసుకుంటున్న మంథనిలో న్యాక్ సెంటర్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ సమాజానికి జవాబు చెప్పాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మంథని పట్టణంలోని రాజ గృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంథని ఎమ్మెల్యే పనితనాన్ని చూస్తే జాలి కలుగుతాందని అన్నారు. దుద్దిళ్ల కుటుంబం ఓట్ల కోసం అలవాటు పడిందని, ఓట్ల కోసం తప్ప అభివృద్ధి కోసం ఏనాడు ఆలోచన చేయడం లేదని ఆయన అన్నారు, ఈ విషయాలను సమాజం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నాలు చేస్తున్నానని ఆయన గుర్తు చేశారు. మంథనికి న్యాక్ సెంటర్ తీసుకువచ్చినా అని ఎదో గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. 32నెలలు గడిచిన తర్వాత ఈ సెంటర్ తీసుకువచ్చినందుకు ఎమ్మెల్యే అవమాన పడాలని అన్నారు. 2004 నుంచి 2009 మధ్యలోనే జీవన్‌రెడ్డి జగిత్యాలకు తీసుకువచ్చారని ఆయన గుర్తు చేశారు. సమాజం మీద యాస ఉంటే అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉంటే ఈ న్యాక్ సెంటర్ ఎప్పుడు తీసుకువచ్చే వారని ఆయన అన్నారు. దుద్దిళ్ల కుటుంబం ఎనిమిదో సారి ఎమ్మెల్యే స్థానంలో ఉన్నారని, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ 25ఏండ్లు ఆయన తండ్రి 15ఏండ్లుగా అధికారంలో ఉంటున్నారని ఆయన తెలిపారు. మొదటి సారి ఎమ్మెల్యేగా, మంత్రిగా అయిన పొన్నం ప్రభాకర్ గత మార్చిలోనే న్యాక్ సెంటర్ తీసుకువచ్చారని, ఆనాడు రూ.20కోట్లు తీసుకువస్తే ఈనాడు రూ.40కోట్లు తీసుకురావాలే కానీ కేవలం రూ.20కోట్లు తెచ్చి గొప్పలు చెప్పుకోవడం, దాన్ని పత్రికలు గొప్పగా రాయడం చాలా బాధాకరమన్నారు అసలు నూతనం భవనం నిర్మాణం అయిన తర్వాత న్యాక్ సెంటర్ ప్రారంభిస్తారా లేక అద్దె భవనంలో ప్రారంభిస్తారో క్లారిటీ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32నెలలు గడిచిపోతుంది.రాష్ట్రంలో అంగన్వాడి సెంటర్లకు కోడిగుడ్డు బంద్ అని పేపర్లలో వచ్చిందని అన్నారు. పెద్దపల్లి కాటారం రోడ్డు పూర్తి చేయడానికి ఐదు ఆరు కోట్లు వచ్చించలేకపోతున్నారని, ప్రజలు సైతం రోడ్డెక్కి ధర్నా చేశారని ఆయన ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఇలాంటి పనులు పూర్తి చేయాలే కానీ 32నెలల తర్వాత న్యాక్ సెంటర్ తీసుకువచ్చి ఏదో గొప్ప పని చేశామని చెప్పుకోవడం విడ్డూరమన్నారు. మంత్రిగా 32నెలల్లో ఏం చేసిండని ఆలోచన చేయాలని, ఈ విషయంపై పత్రికలు రివ్యూ చేసి కథనాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆనాడే జీవన్‌రెడ్డి జగిత్యాలలో 2009 ముందు 20కోట్లతో భవనం కట్టిండని, అలాంటి భవనం కట్టాలంటే ఈనాడు 40కోట్లు కావాలని కానీ మంథని ఎమ్మెల్యే తీసుకువచ్చిన 20కోట్లు తక్కువే కదా అని ఆయన అన్నారు. ఎక్కువ సంఖ్యలో ఉన్న ఈ సమాజం నీ కుటుంబానికి అవకాశం ఇస్తే అధికారంలోకి వచ్చినంక ఈ సమాజం గురించి ఏమీ ఆలోచించలేదని, ఈ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు ఇప్పటికే 32నెలలు గడిచిపోయిందని, మరో నాలుగు మాసాలు అయితే కాలం గడిచిపోతుందని అన్నారు. 32నెలల తర్వాత న్యాక్ సెంటర్ ఎందుకు తెచ్చినవో సమాజానికి జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పొన్నం ప్రభాకర్ మొదటిసారి ఎమ్మెల్యే ఆయనంక మార్చిలోనే జీఓ తెచ్చిండని, ఫస్ట్ టైం ఎమ్మెల్యే కన్నా వెనకబడి ఉన్నావని ఆయన విమర్శించారు. సొంత నియోజకవర్గం కాకపోయినా పొన్నం ప్రభాకర్ కరీంనగర్ బిడ్డగా నీకన్నా ముందు పని చేస్తున్నాడని, కూలగొట్టుడు, అక్రమ కేసులు పెట్టడం తప్ప అభివృద్ధి మీద దృష్టి లేదన్నారు. అభివృద్ధి పనులకు కాగితాలను చూపించి మోసం చేయద్దని, న్యాక్ సెంటర్‌ను ఎప్పుడు ప్రారంభిస్తరో, ఆలస్యం అయినందకు కారణం చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ రాజు గౌడ్,శంకర్ లాల్, శంకర్ గౌడ్, తిరుపతి, శ్రీనివాస్ యాదవ్, వంశీ కృష్ణ, పిల్లి సత్తయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ప్రణాళికతోనే కొత్తగూడెం కార్పొరేషన్ పురోగతి



**కొత్తగూడెం, నేటి శుభోదయ :** సమగ్ర ప్రణాళికతోనే కొత్తగూడెం కార్పొరేషన్ పురోగతి సాధ్యమవుతుందని, ఆ దిశగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు అంకితభావంతో పనిచేయాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదివారం రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శంకుస్థాపనల బహిరంగ సభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టణ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక అవసరాలను తీర్చడం ద్వారానే ప్రజా శ్రేయస్సు సిద్ధిస్తుందని పేర్కొన్నారు. మంజూరైన ప్రతి ఒక్క పనిని నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా వేగంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా పాలనా యంత్రాంగం నిరంతరం శ్రమించాలన్నారు. ప్రజాధనం సద్వినియోగం అయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెరగాలని, సమిష్టి కృషితోనే ఆశించిన ఫలితాలు సాధించగలమని స్పష్టం చేశారు. స్థానిక అవసరాలను గుర్తించి నిధుల కేటాయింపులు జరపాలని ప్రభుత్వమే ఆయన కోరారు. బతకడం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ టౌన్ దమ్మపేట సెంటర్ నుంచి రెండున్నర కిలోమీటర్ల మేర రూ.14 కోట్లతో ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, మంచికంటి నగర్లో ఎస్ కే పి అపార్ట్మెంట్ నుండి ప్రధాన రహదారి వరకు రూ.50 లక్షలతో పక్కా రోడ్డు నిర్మిస్తున్నామని, కొత్తగూడెం పట్టణ పరిధిలోని పోస్టర్ సెంటర్ బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ నుంచి గోధుమ వాగు వరకు వరకు రూ.50 లక్షల నిధులతో డివైడర్లను అభివృద్ధి చేస్తున్నామని కూనంనేని తెలిపారు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి, కూనంనేని తోపాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్లు ఏ సాయిబాబా, వి విశ్వేశ్వరరావు, జీవిఆర్, శ్యామల, అన్నపూర్ణ, నామ కీర్తి, కూరపాటి సుధాకర్, బండి నరసింహ, దుర్గయ్య, బోయిన విజయ్ కుమార్, మునిగడప పద్మ, దాసరి శ్రీనివాస్, ఎర్రబెల్లి శంకర్, పడాల ఆకాంక్ష, మద్దాల హరిత, పి ధనలక్ష్మి , గడ్డం శాంతి ప్రియ, బి.కళావతి, కంచర్ల హిమశ్రీ, సహేరా బేగం, మంద నాగలక్ష్మి , నాయకులు కంచర్ల జమలయ్య, ఎండి యూసుఫ్, గడ్డం సతీష్ కుమార్, భవాని, సాంబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కుల్కచర్లలో మైనర్ బాలుర బైక్ రైడింగ్ ఆగేదెప్పుడు?





**వికారాబాద్ , నేటి శుభోదయ :**
వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలో మైనర్ బాలుర నిర్లక్ష్య బైక్ రైడింగ్ ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో మైనర్లు ఎక్కువగా భాగస్వాములు అవుతుండగా, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకే బైక్‌పై ముగ్గురు, నలుగురు మైనర్ బాలురు ప్రయాణిస్తూ ట్రాఫిక్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. కుల్కచర్ల బస్టాండ్ ప్రాంతంలో మైనర్లు నిర్లక్ష్యంగా బైకులు నడుపుతూ, వీడియోలు తీసుకుంటూ సంచరిస్తున్న దృశ్యాలు తరచూ కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. ఇటీవల ముగ్గురు మైనర్ బాలురు బైక్ నడపడం వల్ల ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగినప్పటికీ, వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.అంతేకాకుండా, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులను కొందరు మైనర్ బాలురు ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.మైనర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల వల్ల జరిగే తీవ్ర పరిణామాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే మైనర్లకు వాహనాలు అప్పగిస్తున్న తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. బస్టాండ్ ప్రాంతంలో విద్యార్థినులను వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, మైనర్ బైక్ రైడింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ప్రజలు పోలీసు శాఖను కోరుతున్నారు.

# పుష్కర కాలపు కల..
## సాకారమైన వేళ..



**షాద్నగర్, నేటి శుభోదయ :** తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాడి చివరికి తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి అమరవీరుల కోసం ఒక స్తూపం ఏర్పాటు పుష్కర కాలంగా కలగానే మిగిలింది. ఉద్యమాల ఐకాసా నాయకులు ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. చివరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో ఆ ప్రయత్నం సఫలం అయింది. పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ఆవరణలో నిర్మాణం చేపట్టిన అమరవీరుల స్తూపాన్ని ఆదివారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరవీరులకు జయ జయ నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం, గద్దర్ కూతురు వెన్నెల, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ కూడా ఈ కార్యక్రమానికి హాజరై అమరవీరులకు నివాళులు అర్పించడం విశేషం. ఐకాసా నాయకులు జనార్ధన్, పినపాక ప్రభాకర్, కరుణాకర్, టీజీ శ్రీనివాస్, గిరిధర్, కృష్ణయ్య, వంగూరి గంగిరెడ్డి, వి. రామారావు, సరాపు జగదీశ్వర్ తొలితరం ఉద్యమకారుడు నాగిళ్ళ గోపాలగుప్త, బిజెపి నాయకుడు శ్రీ వర్ధన్ రెడ్డి, మంగులాల్ నాయక్, కలంకార్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

# ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి- తహశీల్దార్ పురుషోత్తం



**వికారాబాద్, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని తహశీలార్ పురుషోత్తం అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో కొనసాగుతున్న ఓటర్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి, బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అలాగే అనర్హుల పేర్లు చేరకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించాలని, ఎలాంటి తప్పులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముజాహిద్‌పూర్ సర్పంచ్ చంద్ర భూపాల్ రావు, ఆర్ఐ రవీందర్ చారి, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, ప్రజాప్రతినిధులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

# ఆషాఢ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి , నేటి శుభోదయ :**
సంగారెడ్డి పట్టణంలో ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు పాల్గొన్నారు.మొదటగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆషాఢ విందు భోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం పెద్దలను, సభ్యులను ఆప్యాయంగా పలకరించి ఆషాఢ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ఐక్యత, సాంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం ఆషాఢం సందర్భంగా మల్కాపూర్ ఎల్లమ్మ దేవాలయం వద్ద మల్కాపూర్ గౌడ్ సంఘం మాజీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లమ్మ బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాల ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, చింత సాయినాథ్, శ్రీధర్ రెడ్డి, రామప్ప, జలేందర్, అంజద్, వాజిద్‌తో పాటు పద్మశాలి సంఘం, గౌడ్ సంఘం నాయకులు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆషాఢ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**ఏన్కూర్, నేటి శుభోదయ :**
సంగారెడ్డి పట్టణంలో ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు పాల్గొన్నారు.మొదటగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆషాఢ విందు భోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం పెద్దలను, సభ్యులను ఆప్యాయంగా పలకరించి ఆషాఢ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ఐక్యత, సాంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం ఆషాఢం సందర్భంగా మల్కాపూర్ ఎల్లమ్మ దేవాలయం వద్ద మల్కాపూర్ గౌడ్ సంఘం మాజీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లమ్మ బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాల ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, చింత సాయినాథ్, శ్రీధర్ రెడ్డి, రామప్ప, జలేందర్, అంజద్, వాజిద్‌తో పాటు పద్మశాలి సంఘం, గౌడ్ సంఘం నాయకులు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వానలు కురవాలని పూజలు



**నేలకొండపల్లి, నేటి శుభోదయ :**
వనాలు కురవాలని, పంటలు పండాలని మండల కేంద్రంలో ఆదివారం సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి ఆధ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి విపత్తులు రాకుండాప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని, పాడి పంటలతో సిరిసంపదలతో ఉండాలని కోరుతూ బోడ్రాయి కి జలాబిషేకం చేశారు. మహిళలు ఆటా, పాటలతో సందడి చేశారు. గ్రామస్తులు పెద్ద త్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి మాట్లాడారు. వనాలు లేక ఇబ్బందులు పడుతున్న కరువు పరిస్థితులలో గ్రామానికి ఎలాంటి చెడు జరగకుండా మంచి జరగాలని శాంతి పూజలు చేయటం ఆనవాయితీ అన్నారు. అందుకే గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు చింతమళ్ల చిందు. మాదాసు సుజాత, గడ్డం చంద్రకళ, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం సిద్దాల జంగయ్య పుష్పమ్మ దంపతుల నివాసము



**మంథని, నేటి శుభోదయ :**
ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని మంగళ్ పెల్లి పటేల్‌గూడెం గ్రామంలో సిద్దాల జంగయ్య ,పుష్పమ్మ దంపతుల నివాసంలో శ్రీ శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి దివ్య కళ్యాణం నిర్వహించగా, గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ మహోత్సవంలో బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు చిందం రఘుపతి కురుమ, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గణం నర్సింహ కురుమ, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బజారు బిక్షపతి కురుమ, గణం వెంకటయ్య కురుమ, కందాల బిక్షపతి కురుమ తదితర ప్రముఖులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులు సిద్దాల జంగయ్య–పుష్పమ్మ దంపతులను అభినందించారు.

## ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్ సమస్యలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకురాలు బానోత్ మనీషా మదన్ లాల్



**ఏన్కూరు, నేటి శుభోదయ :**
వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం మూలపోచారం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల హాస్టల్‌ను వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బానోత్ మనీషా మదన్ లాల్ సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. హాస్టల్‌లో సరిపడా ఫ్యాన్లు, బల్లాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చదువుకునేందుకు, విశ్రాంతి తీసుకోవడానికి ఇబ్బందిగా మారిందని విద్యార్థులు వివరించారు.విద్యార్థుల సమస్యలను శ్రద్ధగా విన్న బానోత్ మనీషా మదన్ లాల్ మాట్లాడుతూ, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు.గిరిజన విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునే వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని, విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం తగదని ఆమె పేర్కొన్నారు.

## అగ్రకుల నాయకులు మద్దసి,మదారి కురువలకు రాజ్యాంగం ద్వారా అందవలసిన హక్కులను కాలరాస్తున్నారు

**-మాజీ కౌన్సిలర్,కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్**



**రాజేంద్రనగర్, నేటి శుభోదయ :**
అగ్రకుల నాయకులు మద్దసి,మదారి కురువలకు రాజ్యాంగం ద్వారా అందవలసిన హక్కులను కాలరాస్తున్నారని మాజీ కౌన్సిలర్,కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ తెలిపారు.ఆదివారం కాటేదాన్ డివిజన్ బాబుల్ రెడ్డి నగర్ లోనీ శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవాలయంలో బిర లింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో తెలంగాణ మదారి కురువ మదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాజేంద్రనగర్ మండలం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కులజుల అవగాహన సదస్సులకి ముఖ్య అతిథులుగా కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ మాజీ కౌన్సిలర్,డి రంగన్న వ్యవస్థాపక అధ్యక్షులు పాల్గొన్నారు.జేఏసీ కన్వీనర్ కురువ చిన్న మల్లయ్య,రాష్ట్ర కోశాధికారి పసుపుల అశోక్,రాష్ట్ర నాయకులు తిక్కన్న మాట్లాడుతూ..మన కులపత్ర సాధన ద్వార కుల హక్కులను ఎలా పొందాలి,అనే అంశంపై ముఖ్య మేలుకువలను భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన వివిధ ప్రోత్సకాలు మొత్తంగా వివరించడం జరిగిందన్నారు.గత డెబ్బై ఆరు సంవత్సరాల నుంచి మన కులస్తులు కోల్పోయిన హక్కుల విధము,సవరించుకోవలసిన ముఖ్య లోపాలను కులజులకు వివరించడం జరిగిందన్నారు.సభకు హాజరైన కులజుల సమక్షంలో ఎన్నికైన రాజేంద్రనగరు మండల కమిటీని పరిచయం చేస్తూ వారి సేవలను ఉపయోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో అశోక గ్రాండ్ హోటల్ యజమాని అశోక్,బెల్లంపల్లి వెంకటేష్,బాలరాజు అడ్వకేట్,పోతు రాజు మల్లేష్,కిష్టప్ప,గిర్ని రాములు,ఉప్పల్ శీను,సెంట్రింగ్ శంకర్,వెంకటరమణ,రాజలింగం,నామాల రాము,మహేందర్,రఘు వీర్,శివకుమార్,శేఖర్,పెద్ద సంఖ్యలో మాదారి కురువ,మాదాసి కురువ కులజూలు తదితరులు పాల్గొన్నారు.

## ' ఎస్ఐఆర్ ' పేరుతో సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-పెద్ద అంబర్పేట్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ :**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎస్ఐఆర్) ప్రక్రియకు ప్రజలంతా సహకరించాలని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ తట్టి అన్నారం తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయి ప్రయాత్నాలను మరింత ముమ్మరం చేయాలన్నారు. బీఎల్వోలకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పులు, నిర్లక్ష్యం లేదా ఒత్తిడికి తావివ్వకుండా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాలు క్షుణ్ణంగా నమోదు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఓటర్లు బీఎల్ఓలకు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే పునాది అని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ఓటరు జాబితా కచ్చితత్వం కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి పౌరుడికి అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, వాటిని సక్రమంగా పూరింపజేసి తిరిగి స్వీకరించాలని సూచించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు ప్రజలకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. బీఎల్ఓలు చేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఫారాలను సకాలంలో పూర్తిచేసి అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలూ లేదా బ్యాంకింగ్ వివరాలను పంచుకోవద్దని తెలిపారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని వారు ఓటర్లకు సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఓటరు సర్ ప్రక్రియలో విధిగా పాల్గొనాలని వారు సూచించారు.

## సర్ ప్రక్రియ సమగ్రంగా జరగాలి ఓటు వృధా కాకూడదు బిజెపి జిల్లా ఇన్చార్జి డాక్టర్ కోరదాల నరేష్



**హాఫీజ్ పెట్, నేటి శుభోదయ :**
ఆదివారం హాఫీజ్ పేట్ డివిజన్, గంగారం గ్రామం బస్తీ దవాఖాన , గంగారాం ఎంపీపీ స్కూల్ , ఇంజనీర్ ఎంక్లేవ్ , హుడా కాలనీ , ఆర్టీసీ కాలనీ , మై హోమ్ జివెల్ లో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సార్) కార్యక్రమాన్ని ఆయా పోలింగ్ బూత్‌ల బి ఎల్ ఓ లు బిజెపి బి ఎల్ ఏ- 2 లతో కలిసి పరిశీలించిన బీజేపీ జిల్లా ఇంచార్జి డాక్టర్ కోరదాల నరేష్ , బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అజిత్ కుమార్ సేనాపతి , హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్,ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫోరం పంపిణీ , ఓటరు మార్పులు, చేర్పులు మరియు తొలగింపుల ప్రక్రియను సమీక్షించి,కార్యక్రమం సజావుగా నిర్వహించేలా అవసరమైన సూచనలు చేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ మాజీ కౌన్సిలర్ రమణయ్య , హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులు ప్రసాద్ పాత్రో , హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ కోశాధికారి సుభాష్ , బీజేపీ నాయకులు మోహన్ ముదిరాజ్ , శేఖర్ ముదిరాజ్ , రామ్ రెడ్డి , హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ యువ మోర్చా ప్రధాన కార్యదర్శి బాలరాజు, బీజేపీ నాయకులు సూర్య , తరుణ్ , భాస్కర్, వినోద్ ఇతరులు పాల్గొన్నారు.

## అక్కేపెల్లి మాజీ సర్పంచ్ పెయ్యల గట్టయ్య చిత్రపటానికి ఘన నివాళులు

### -మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

**మంథని, నేటి శుభోదయ :** మంథని మండలం సిద్దపల్లె గ్రామానికి చెందిన అక్కేపెల్లి మాజీ సర్పంచ్ పెయ్యల గట్టయ్య ఇటీవల మరణించగా, వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్. అనంతరం గట్టయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ధైర్యం చెప్పి, గట్టయ్య గ్రామ అభివృద్ధికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## పేదలకు ఉన్నతమైన విద్యను అందించడమే డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క లక్ష్యం

**మధిర, నేటి శుభోదయ :**
సమాజ అభివృద్ధిలో కీలక భాగం అయిన విద్య అన్ని వర్గాల ప్రజలకు అందాలనే సదా ఉద్దేశంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిరకు ఇంజనీరింగ్ కాలేజీ ఎంత అవసరమో అనే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి మధిరకు ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేయటం మధిర ప్రాంతానికి ఒక వరం లాంటిదని అందుకే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విద్యాప్ర దాతాగా కొనియాడుతున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు మండల అధ్యక్షులు పారుపల్లి విజయ్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ కోన దని కుమార్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు చావా రామకృష్ణ రంగా హనుమంత రావు జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు తదితరులు మాట్లాడుతూ మధిర ప్రాంతానికి ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ ఎంతో అవసరమని పేద బడుగు బలహీన వర్గాలకు ఇది ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిర ప్రాంత అభివృద్ధికి ఇప్పటికే వందల కోట్ల రూపాయలు కేటాయించి ఆగు త్రాగునీరు విద్య వైద్యం ఆరోగ్యం అనేక అంశాలపై దృష్టి పెట్టారు దానిలో భాగంగానే మధిర కి ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేయించడం ఎంతో గొప్ప విషయం అని ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమైనదని వారు ఈ సందర్భంగా



పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేయటంలో విద్యా ప్రదాత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషి ఎనలేనిదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వారికి ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని తెలిపారు. మధిరకు ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయటం పట్ల ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కూడా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు జీవో పత్రాలను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్, ఎర్రిపాలెం నాయకులు మాజీ భద్రాచలం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి చిట్టిబాబు తన్నీరు రామకృష్ణ రంగా శీను చింతకాని మండలం కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ ఎల్‌నినోను సమిష్టిగా ఎదుర్కొందాం -మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**మంథని/కరీంనగర్, నేటి శుభోదయ :**
సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని రైతులు, ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం మిషన్ మోడ్‌లో పనిచేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు వరి సాగులో తొందరపడకుండా కందులు, పప్పుధాన్యాలు, నువ్వులు, వేరుశనగ వంటి తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. గ్రామ గ్రామాన రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేసి రైతులకు అండగా నిలవాలని, ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితులను




నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొబైల్ కోర్టులను పునరుద్ధరించాలి

### -మంత్రి పొంగులేటికి న్యాయవాదుల వినతి

**భద్రాచలం, నేటి శుభోదయ :**
ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ కోర్టులను పునరుద్ధరించాలని భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక న్యాయవాదులు ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాల్లో నివసించే వారికి సులభంగా, త్వరితగతిన న్యాయం అందించే 'మొబైల్ కోర్టుల' వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఓ. ఆర్ టి. నెంబర్ 70 ను తక్షణమే ఉపసంహరించుకోవాలని భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా వారు వ్యక్తం చేసిన ప్రధానాంశాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అసోసియేషన్ సవివరంగా వివరించింది. ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాల పరిధి లోని మారుమూల గ్రామ ప్రజలకు న్యాయం అందించే మొబైల్ కోర్టులు అందుబాటులో లేకపోవడం వల్ల, వారు న్యాయం కోసం సుదీర్ఘకాలం నిరీక్షించాల్సి వస్తోందని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. సివిల్ న్యాయ పరిపాలనను ఆర్.డి.ఓ లు లేదా సబ్-కలెక్టర్లకు బదలాయించడం వల్ల, వారు తమ ఇతర పరిపాలనా పరమైన విధుల్లో బిజీగా ఉండి, న్యాయ విచారణపై దృష్టి సారించలేక పోతున్నారని అసోసియేషన్ పేర్కొంది. దీనివల్ల గిరిజన ప్రాంత ప్రజలు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఇది వారి ఆర్థిక స్థితిని మరియు దైనందిన జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తోందని వారు వివరించారు. సరైన సమయంలో విచారణ జరగక, సామాన్య ప్రజలు తమకు జరిగిన అన్యాయానికి పరిష్కారం పొందలేక సతమతమవుతున్నారని వారు పేర్కొన్నారు. మొబైల్ కోర్టులు కేవలం పరిమిత కాలానికి మాత్రమే ఏర్పాటు చేసినవి కావని, 'మలోత్ తిరిపి, ఇతరలు వర్సెస్ మలోత్ రుక్మిణి మరియు ఇతరులు (2006( 2) ఏఎల్ డి 650) కేసులు న్యాయమూర్తి గోపాల్ రెడ్డి గారు స్పష్టం చేసినట్లుగా బార్ అసోసియేషన్ గుర్తుచేసింది. ప్రభుత్వం ఈ జీవోను



జారీ చేసే క్రమంలో ప్రస్తావించిన "కొడిమి రాజమ్మ" తీర్పును మరియు ఆగస్టు 20,2025 నాటి హైకోర్టు ఉత్వరులు తుది తీర్పులు కావని అవి కేవలం పెండింగ్ లో ఉన్నవని అసోసియేషన్ పేర్కొన్నది. అంతేకాకుండా న్యాయమూర్తి భీమపాక నగేష్ ఆగస్టు 20 20న ఇచ్చిన ఉత్తర్వులు ఎక్కడ సివిల్ న్యాయాన్ని తిరిగి ఆర్డీవోలకు అప్పజెప్పాలని నిర్దిష్టమైన ఆదేశాలు లేవని వారు తెలిపారు. ఇది భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 కల్పించిన "త్వరితగతి విచారణ " హక్కులకు పూర్తిగా విరుద్ధమని వారు పేర్కొన్నారు. చట్టబద్ధమైన ప్రతిపాదిక లేని జీవో ఆర్ టి నెంబర్ 70 ని తక్షణమే రద్దు చేయాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఏజెన్సీ ప్రాంత ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మొబైల్ కోర్టును యధా విధంగా తిరిగి ప్రారంభించి, న్యాయ ప్రక్రియను వేగవంతం చేయాలని భద్రాచలం అసోసియేషన్ కోరుకుంటుంది. ఈ వినతి పత్ర సమర్పణలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ఉపాధ్యక్షులు సున్నం రమేష్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, సీనియర్ న్యాయవాదులు రావి రామ్మోహన్, పేరాల నాగరాజు, వలవల సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## నూతన సీసీ రోడ్డుకు శంకుస్థాపన

**మధిర టౌన్, నేటి శుభోదయ**
మండల పరిధిలోని ఇల్లూరు గ్రామంలో మాజీ ఎంపీ, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి సహకారంతో ఇల్లూరు గ్రామంలో ముస్లిం కాలనీలో రూ 5.5 లక్షల నిధులతో సిసి రోడ్డుకు సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇల్లూరు గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరికి, కాంగ్రెస్ జిల్లా నాయకులు జవ్వాజి ఆనందరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోటా వీరయ్య వార్డు నెంబర్స్ ముస్లిం పెద్దలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## ఓబీసీ బలోపేతమే లక్ష్యం..

### వెంకటేశ్వర్ నగర్‌లో బీజేపీ కమిటీ ఏర్పాటు



**శేర్లింగంపల్లి, నేటి శుభోదయ :** శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని వెంకటేశ్వర్ నగర్ డివిజన్-248లో ఓబీసీ కమిటీని బీజేపీ డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు సిహెచ్. కృష్ణ మురళి పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షుడు బాలు యాదవ్, రాష్ట్ర ఓబీసీ నాయకుడు గోవర్ధన్ చారి, మాజీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, డివిజన్ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బాలు యాదవ్ మాట్లాడుతూ, ఓబీసీ వర్గాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజు, జనరల్ సెక్రటరీ వినీత్ గౌడ్, ఎం. యాదగిరి, కామరాజు యాదవ్, బీజేపీ నాయకులు ప్రశాంత్, కవిత, సంతోష్, బీజేవైఎం అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహేందర్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కుమార్, హరీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా డిఎంహెచ్ఓ వేధింపులు ఆపాలి..



**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం డిఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణ కుమారి కిందిస్థాయి డాక్టర్లను, ఏఎన్ఎం లను,ఆశావర్కర్ల ను వేదింపులకు చేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోద రాజనర్సిహ ను కలసి విన్నవించినా టీఎన్జీవో రాష్ట్ర నాయకులు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు ఊటు యశ్వంత్ కార్యదర్శి శ్రీనివాసరావు కలిశారు..కింది స్థాయి ఉద్యోగులపైన ఇష్టానుసారంగా జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణ కుమారి వేధిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి డాక్టర్లను, ఏఎన్ఎం లను వేధిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని టీఎన్జీవో ఉద్యోగ సంఘాలకు హామీ ఇచ్చారు.

## నూనె కు ఓదార్పు

**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఖమ్మం త్రీటౌన్ ఏరియా సీపీఐ సెక్రటరీ నూనె శశిధర్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని ఖమ్మం సీపీఐ వన్ టౌన్ సెక్రటరీ వరద నరసింహరావు ఆదివారం తన మిత్రబృందంతో కలిసి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఉమ్మినేని రామారావు, నాయకులు దామాల సత్యం, కొప్పుల రామారావు వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మనోధైర్యాన్ని కల్పించారు.



## లైఫ్ లిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన




**సికింద్రాబాద్, నేటి శుభోదయ :**
లైఫ్ లిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో, సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్ వారి సహకారంతో నామాలగుండు ఉప్పర్ బస్తిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఉదయం ప్రారంభమైన ఈ ఉచిత వైద్య శిబిరం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగగా, వందలాది మంది ప్రజలు భారీ సంఖ్యలో హాజరై వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్త పరీక్షలు, రక్తపోటు (బీపీ) పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు తదితర సేవలను ఉచితంగా అందించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడం పట్ల లైఫ్ లిఫ్ట్ సొసైటీ ఫౌండర్ & చైర్మన్ చంద్రశేఖర్ ను స్థానిక ప్రజలు అభినందించారు.ఈ కార్యక్రమానికి శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఫౌండర్ & చైర్మన్ నోముల ప్రకాష్, 7 హిల్స్ బిల్డర్స్ అధినేత ఏడుకొండలు, సికింద్రాబాద్ టీడీపీ ఇన్చార్జి, జబర్దస్త్ కామెడీ షో నటుడు వల్లరాపు శ్రీనివాస్, తెలంగాణ విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మదన్ మోహన్ చారి, ప్రముఖ సినీ నటి సంధ్య, హెల్త్ & ఫిట్‌నెస్ మోటివేటర్ అనుప్రసాద్, టీఆర్ఎస్ నాయకుడు శేఖర్, భానుమతి, ఫ్యాషన్ డిజైనర్ భార్గవి, గగన కుమారి తదితర ప్రముఖులు పాల్గొని శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని లైఫ్ లిఫ్ట్ సొసైటీ నిర్వాహకులు తెలిపారు.

## ఖమ్మంలో వైభవంగా ప్రారంభమైన శ్రీ మేధా దక్షిణామూర్తి ఏకాదశ మాల దీక్ష

**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఖమ్మం నగరంలోని మోతీనగర్, పి.ఎస్.ఆర్. రోడ్‌లో వెలసిన శ్రీ భ్రమరాంబ సమేత గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆదివారం ఉదయం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. "హర హర మహాదేవ" "ఓం నమః శివాయ" "జయ గురు దక్షిణామూర్తి" నినాదాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది.ఆలయంలో కొలువై ఉన్న శ్రీ మేధా దక్షిణామూర్తి స్వామివారి 11 రోజుల ఏకాదశ మాల దీక్ష జూలై 19వ తేదీ ఉదయం 7 గంటలకు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, మాలాధారణ కార్యక్రమంతో అత్యంత వైభవంగా ప్రారంభమైంది.ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ కృష్ణశర్మ గురుస్వరూపంలో అందించిన మాలను ధరించి ఏకాదశ దీక్షను స్వీకరించారు. గురు పౌర్ణమి వరకు కొనసాగనున్న ఈ పవిత్ర దీక్షలో పాల్గొనేందుకు భక్తులు విశేష ఆసక్తి కనబరుస్తున్నారు.

### జ్ఞానానికి ఆదిగురువు శ్రీ మేధా దక్షిణామూర్తి

హిందూ సనాతన ధర్మంలో శ్రీ దక్షిణామూర్తి పరమశివుని గురుస్వరూపంగా, సర్వలోకాలకు ఆదిగురువుగా ఆరాధించబడతారు. మాటలతో కాకుండా మౌన ఉపదేశం ద్వారా ఋషులకు బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదించిన పరమ గురువుగా ఆయనకు విశిష్ట స్థానం ఉంది.శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూపం మేధాశక్తి, జ్ఞాపకశక్తి, విద్య, వివేకం, ఆధ్యాత్మిక జ్ఞానం, గురుకృపలకు ప్రతీకగా భావిస్తారు. అందువల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వేదపండితులు, ఉద్యోగార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఈ స్వామివారిని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తుంటారు.

### ఏకాదశ మాల దీక్ష విశిష్టత ఏమిటి?

గురు పౌర్ణమికి ముందు నిర్వహించే 11 రోజుల ఏకాదశ మాల దీక్ష గురుతత్వాన్ని ఆరాధించే అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక సాధనగా భావించబడుతుంది.ఈ దీక్షలో పాల్గొనే భక్తులు, నిత్య అభిషేకాలు, పూజలు నిర్వహించడం, గురు మంత్ర జపం, ధ్యానం చేయడం, సాత్విక ఆహారాన్ని మాత్రమే స్వీకరించడం, నియమనిష్ఠలతో దీక్షను ఆచరించడం, ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమవడం వంటి ఆచారాలను పాటిస్తారు. హిందూ సంప్రదాయ విశ్వాసాల ప్రకారం ఈ దీక్షను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తే మేధాశక్తి, జ్ఞాపకశక్తి, విద్యలో ఏకాగ్రత, గురు అనుగ్రహం, మనశ్శాంతి, వివేకం, ఆధ్యాత్మిక చైతన్యం లభిస్తాయని భక్తులు విశ్వసిస్తారు.

### భక్తులకు ఆలయ నిర్వాహకుల సూచనలు

దీక్ష స్వీకరించదలచిన భక్తులు ముందుగా ఆలయ నిర్వాహకులను సంప్రదించాలని ఆలయ కార్యనిర్వాహణ అధికారి చుండూరు రామకోటేశ్వరరావు సూచించారు. దీక్షలో భాగంగా గంధపు రంగు వస్త్రాలు ధరించడం, పురుషులు పంచె–కండువా లేదా గంధం రంగు చొక్కా ధరించడం, మహిళలు సంప్రదాయ దుస్తులతో పాల్గొనడం, ప్రతిరోజూ ఆలయ పూజల్లో పాల్గొనడం వంటి నియమాలను పాటించాలని తెలిపారు. గురు పౌర్ణమి వరకు ప్రతిరోజూ ప్రత్యేక అభిషేకాలు, రుద్రపారాయణం, గురుపూజ, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి చుండూరు రామకోటేశ్వరరావు, ప్రధాన అర్చకులు దాములూరు కృష్ణ శర్మ వెల్లడించారు.

### 500 ఏళ్ల చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం – గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం

ఖమ్మం నగరంలోని శ్రీ భ్రమరాంబ సమేత గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం దాదాపు 400–500 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రాచీన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. కాకతీయుల కాలం నాటి ఈ ఆలయంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి శివలింగం స్వయంభూగా వెలసిందని భక్తుల విశ్వాసం. ప్రతిరోజూ నిత్యారాధనలు, అభిషేకాలు నిర్వహించబడుతుండగా, మహాశివరాత్రి, కార్తీకమాసం, ప్రదోషకాలం సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

### ఖమ్మంలో ప్రత్యేక ఆధ్యాత్మిక ఆకర్షణగా ఏకాదశ మాల దీక్ష

జ్ఞానానికి ప్రతీకగా, గురుతత్వానికి నిలువెత్తు రూపంగా వెలసిన శ్రీ మేధా దక్షిణామూర్తి స్వామివారి అనుగ్రహం కోసం ప్రారంభమైన ఈ 11 రోజుల ఏకాదశ మాల దీక్ష భక్తుల్లో విశేష ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతోంది.గురు పౌర్ణమి వరకు కొనసాగనున్న ఈ మహోత్సవంలో ప్రతిరోజూ వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందుతున్నారు. ఖమ్మం నగరంలో ప్రస్తుతం ఈ దీక్ష ఆధ్యాత్మిక విశేష ఆకర్షణగా నిలిచి భక్తి, గురుభక్తి, జ్ఞానసాధనకు ప్రతీకగా మారింది.

## రౌడీ షీటర్ పెట్రోల్ దాడిలో కాంగ్రెస్ నాయకుడు ఆడుప మహేష్ మృతి...
### -హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు





**వరంగల్, నేటి శుభోదయ :**
జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, సోషల్ మీడియా ఇంచార్జ్ అడప మహేష్‌పై హత్యాయత్నం జరిగింది.రాజకీయ కక్ష సాధింపు మరోసారి రక్తం చిందించింది. వర్ధన్నపేట నియోజకవర్గంలో వర్గపోరు అగ్గి రాజుకుంది. ఎనుమాముల ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ 14వ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఆడుప మహేశ్ దారుణ హత్యకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే శనివారం రాత్రి ఎన్టీఆర్ నగర్‌కు చెందిన జన్ను మధు అనే వ్యక్తి ఆడుప మహేశ్‌కు ఫోన్ చేసి కోటిలింగాల ఆలయం సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి రమ్మని చెప్పినట్లు సమాచారం. దీంతో అక్కడికి వెళ్లిన మహేశ్‌ను పత్రి కుమార్ అడ్డగించాడు. మద్యం మత్తులో ఉన్న వారు ఎమ్మెల్యే దగ్గర మా గురించి ఏం చెప్పావ్ అంటూ నిలదీసినట్టు సమాచారం. మహేష్ సమాధానం చెప్పేలోపే అతని ఫోన్ లాక్కొని, ఒంటి పై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు సమాచారం. దీంతో తీవ్ర గాయాలపాలైన మహేశ్ ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకుని తన గ్రామానికి చేరుకున్నాడు.స్థానికులు వెంటనే గమనించి చికిత్స నిమిత్తం మహేష్ ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మహేశ్ మృతి చెందారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడైన పత్రి కుమార్ పై ఇప్పటికే ఓ హత్య కేసు ఉన్నట్లు సమాచారం. ఆ కేసులో కోర్టు జీవిత ఖైదు విధించినప్పటికీ బెయిల్ పై బయటకు వచ్చి మళ్లీ ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో మహేశ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 26 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డాను. నాపై దాడి చేసిన వారిని ఎన్‌కౌంటర్ చేయాలి. లేకుంటే నా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి అని కన్నీటి పర్యంతమయ్యారు. మహేష్ భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసిగొండ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ విశ్వేశ్వర్ పత్తి కుమార్, జన్ను మధు పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పత్తి కుమార్ పై గతంలో హత్య కేసు మరియు ఇతర కేసులు కూడా ఉన్నాయి అని ఏనుమముల పోలీస్ స్టేషన్ లో రౌడీ షీట్ కూడా ఉంది. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉండగా, వారిని త్వరలోనే అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని సిఐ తెలిపారు.

## పుష్కరాల నాటికి దేవస్థానం పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలి
### -మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.

**భద్రాచలం, నేటి శుభోదయ :** గోదావరి పుష్కరాల నాటికి భద్రాద్రి దేవస్థానం పునరుద్ధరణ పనులు పూర్తిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. ఆదివారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి స్వామివారిని ఆదివారం దర్శించుకున్నారు.ఈ పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన మంత్రి కి సారపాక ఐ టి సి గెస్ట్ హౌస్ నందు జిల్లా కలెక్టర్ అంకిత్ మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన మంత్రికి దేవస్థానం అర్చకులు, వేద పండితులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక దర్శనం చేసుకున్న మంత్రి వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.దర్శనం అనంతరం మంత్రి జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనెం దొర, దేవస్థానం ఈవో దామోదర్ రావు లతో కలిసి ఆలయంలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఆలయ పునరుద్ధరణ పనుల రూపకల్పన, పురోగతి, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మ్యాప్‌ల ద్వారా మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన అనంతరం శ్రీరామనవమి పర్వదినాన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు.ఆలయ పునరుద్ధరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లు మంజూరు చేసిందని, ఆలయ అభివృద్ధి, విస్తరణ కోసం అవసరమైన భూసేకరణకు సుమారు రూ.75 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పునరుద్ధరణ పనులను వంద శాతం పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు .భద్రాచలం దేవస్థానం ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఆలయ పునరుద్ధరణ పనులను ఆగమశాస్త్రాలకు అనుగుణంగా, శాస్త్రోక్తంగా చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఆలయ గోపురాలు, పురాతన నిర్మాణాల నాణ్యతను నిపుణులతో పరిశీలించి, వాటి ప్రాచీన వైభవానికి ఎలాంటి భంగం కలగకుండా పనులు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.వచ్చే గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని గోదావరి పరివాహక ప్రాంతంలో నూతన స్నాన ఘాట్ల నిర్మాణం, యాత్రికుల సౌకర్యాల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్థానిక ప్రజలు, భక్తుల విజ్ఞప్తుల మేరకు అవసరమైన ప్రాంతాల్లో నూతన స్నాన ఘట్లు పనులను కూడా కార్యాచరణలో చేర్చినట్లు చెప్పారు.పునరుద్ధరణ పనుల కారణంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంజినీరింగ్ శాఖ, దేవాదాయ శాఖ అధికారులతో ఆలయ పునరుద్ధరణ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆలయ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణ కోసం ఇంజినీరింగ్ శాఖ నుంచి ప్రత్యేక అధికారిని వెంటనే నియమించాలని దేవాదాయ కమీషనర్ హనుమంతరావు టెలిఫోన్ ద్వారా ఆదేశించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ప్రతి 10 రోజులకు ఒకసారి క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని సమీక్షించాలని సూచించారు.వచ్చే గోదావరి పుష్కరాలకు 15 రోజుల ముందుగానే అన్ని పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఒకవైపు పనులు పూర్తయిన తర్వాత మరోవైపు పనులు ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించాలని, తద్వారా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఎక్కువ పనులు చేపట్టాల్సిన ఉత్తర భాగంలో పనులను ప్రాధాన్యతతో ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.డ్రాయింగ్‌లు, డిజైన్‌లు, సాంకేతిక అనుమతుల్లో జాప్యానికి తావు ఇవ్వకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. బాధ్యత కలిగిన అధికారులను మాత్రమే పనుల పర్యవేక్షణకు నియమించి వారు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.అవసరమైన చోట ప్రస్తుతం ఉన్న కార్మికుల కంటే 25 శాతం అదనంగా కార్మికులను నియమించి, నిరనంతరం పనులను వేగవంతం చేయాలని, రిటైనింగ్ వాల్స్, కాంక్రీట్ నిర్మాణాలు, ఇతర మౌలిక వసతుల పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. రాతి నిర్మాణాలు, శిల్పకళా పనులను అనుభవజ్ఞులైన శిల్పులు, నిపుణులతోనే చేపట్టి నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఆలయ పునరుద్ధరణ పనులకు అవసరమైన ఇసుకను చట్టబద్ధంగా అందుబాటులో ఉన్న ప్రాంతాల నుంచి సకాలంలో సరఫరా అయ్యేలా అవసరమైన అనుమతులు జారీ చేస్తామని తెలిపారు. నిర్మాణ పనులకు అన్ని విధాలుగా జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని చెప్పారు.

## అక్కారంలో హమాలి సంఘం ఆధ్వర్యంలో మైసమ్మ పండగ

**గజ్వేల్, నేటి శుభోదయ :**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలోని శివ కేశవ గోదాంలో హమాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మైసమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలి సంఘం నాయకులు మాట్లాడుతూ కార్మికులందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని, గోదాంలో పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. ఏటా ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, కార్మిక ఐక్యతను చాటేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోదాం నిర్వాహకులు రాజుతో పాటు హమాలి కార్మికులు చంద్రం, యాదగిరి, బిక్షపతి, స్వామి, అశోక్, కనకరాజు పాల్గొన్నారు. అలాగే బూడిగే కనకయ్య, స్వామి, సాయినాథ్, ప్రశాంత్, నర్సింలు, బాబు, మల్లయ్యతో పాటు అక్కారం



గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# రావిగూడెంలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం

**ఖమ్మం, నేటి శుభోదయ :**
శ్రీరక్ష హాస్పిటల్, ఖమ్మం నెహ్రూ నగర్, కేజిహెచ్ హాస్పిటల్ – ఖమ్మం మయూరి సెంటర్ ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా, డోర్నకల్ మండలం, రావిగూడెం గ్రామం, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రావిగూడెం గ్రామంలోని ఎంపిపిఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో, శ్రీరక్ష హాస్పిటల్ (ఖమ్మం – నెహ్రూ నగర్), కేజిహెచ్ హాస్పిటల్ (ఖమ్మం – మయూరి సెంటర్) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చిట్టి బాబు ఆధ్వర్యంలో, జుజ్జూరి వెంకటేశ్వర్లు – సత్యవతి దంపతుల కుమారుడు జుజ్జూరి నాగార్జున, యామిని దంపతుల కుమార్తెలు జోషిత, నియశ్రీల పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని సమాజ సేవా దృక్పథంతో నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో శ్రీరక్ష హాస్పిటల్ అధినేత డా. గోంగూర వెంకటేశ్వర్లు (డాక్టర్ జివి ), డా. షేక్ ఏడుకొండలు, ఖమ్మం జిల్లా జై గౌడ సంఘం అధ్యక్షులు హనుమంతరావు, కేజిహెచ్ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొని గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి, అవసరమైన వైద్య సలహాలు, జీవనశైలి మార్పులపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సూచనలు అందించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌కు గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల



ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి పునాది అనే భావనతో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎంఓ సాత్విక్, గజ్జెల శ్రీనివాస్, ఆత్మకూరి నాగేశ్వరావు, అరుణ్ కుమార్, గంజర్ల శ్రీకాంత్, రాయల శ్రీకాంత్, కనితి సరోజిని, కేజిహెచ్ హాస్పిటల్ మేనేజర్ నాగేశ్వరావు, కమలాకర్, ఎర్లీ ఆన్ లైఫ్ సెన్సెస్ మెడికల్ ఎక్విప్‌మెంట్ ప్రతినిధి అంకురావు తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడంలో తమ వంతు సహకారం అందించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే సంకల్పంతో శ్రీరక్ష హాస్పిటల్, కేజిహెచ్ హాస్పిటల్ సంయుక్తంగా ఇలాంటి ఆరోగ్య సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా విస్తృతంగా కొనసాగించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు

# భక్తి శ్రద్ధలతో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ 14వ వార్షికోత్సవం

**సికింద్రాబాద్, నేటి శుభోదయ :**
వేద మంత్రాల నడుమ సికింద్రాబాద్ జనరల్ బజార్ లోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ 14వ వార్షికోత్సవం జరిగింది. ఆదివారం ఉదయం చతుస్థానార్చన, మహాకుంభ ఆవాహనం, మూలమూర్తి హవనము, పంచవిశింతి కలశస్నపనం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఈ క్రతువులతో పాటు అనంతరం నిర్వహిం చిన గోష్టిలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కన్నుల పండువగా నిర్వహించిన ఈ వార్షికోత్సవంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ అనువంశిక ధర్మకర్త గుమిడెల్లి శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రేమ్ కుమార్ రావులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# తీపి గురుతుల కలబోత, అంబరాన్నంటిన ఆత్మీయత

- **బాల్యపు జ్ఞాపకాలతో సందడి చేసిన పాత నేస్తాలు**

**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఎక్కడో వదిలేసిన బాల్యం మళ్లీ కళ్ల ముందుకొచ్చింది. నాలుగు దశాబ్దాల క్రితం నాటి స్మృతులు ఆత్మీయ పలకరింపులతో ప్రాణం పోసుకున్నాయి. పలకల మీద రాసుకున్న అక్షరాలు చెరిగిపోయినా, మనసుల మీద ముద్రించుకున్న స్నేహం చెరగదని ఆ పాత నేస్తాలు నిరూపించారు. నేలకొండపల్లి మండలం అనంతనగర్‌లోని అరవింద విద్యాలయం 1987, 88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఖమ్మం వైరా రోడ్డులోని త్రివేణీ స్కూల్ ప్రాంగణంలో అట్టహాసంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన ఈ వేడుకలో పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని గతస్మృతుల్లో పరవశించిపోయారు.--- ఆటపాటలతో సందడి ఉదయం అల్పాహారం అనంతరం పీఈటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో పూర్వ విద్యార్థులంతా వయసును మరిచిపోయి ఉత్సాహంగా పాల్గొన్నారు. స్కూల్ రోజుల నాటి ఆటలు, పాటలతో ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుక ఏర్పాట్లలో, ముఖ్యంగా క్రీడలు, విందు, బహుమతుల పంపిణీలో తిరుపతి నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన మిత్రురాలు రూపారాణి తీసుకున్న చొరవను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.--- ఈ సత్కారం నా జీవితంలో మరువలేనిదిఈ సందర్భంగా, పోలీసు శాఖలో అద్భుత ప్రతిభ కనబరిచి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంచే మహోన్నత సేవా పతకం అందుకున్న ఖమ్మం ఇంటెలిజెన్స్ సీఐ చల్లగుండ్ల శ్రీనివాసరావును మిత్రులంతా కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆత్మీయ సన్మాన పత్రాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు ఉద్వేగంతో మాట్లాడుతూ పోలీసు శాఖలో నేను ఎన్నో పతకాలు సాధించినా కూనవరం వరదల్లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చగలిగానంటే ఆ ధైర్యం, క్రమశిక్షణ నాకు ఈ బడిలోనే అలవడ్డాయి. నేను ఎన్ని స్టేట్ మెడల్స్ అందుకున్నా, నా చిన్ననాటి స్నేహితుల చేతుల మీదుగా అందుకుంటున్న ఈ ఆత్మీయ సత్కారం నా జీవితంలో అత్యంత మధురమైనది, చిరస్థాయిగా నిలిచిపోయేదని తన అనుభవాలను పంచుకున్నారు.--- మళ్లీ కలుసుకోవడం నా అదృష్టం ఇదే



బ్యాచ్‌కు చెందిన మిత్రుడు, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విద్యనభ్యసించి ప్రస్తుతం అమెరికాలో ఉన్నతస్థాయిలో స్థిరపడిన అవినేని ఆనంద్ ఈ కార్యక్రమానికి హాజరు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్వాహకులు ఆయనను వేదికపై ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ వృత్తిరీత్యా అమెరికాలో స్థిరపడినా, తన మూలాలు, మిత్రులు ఇక్కడే ఉన్నారన్నారు. తాను ఇండియాకు వచ్చిన సమయంలోనే ఈ కార్యక్రమం జరగడం, దశాబ్దాల తర్వాత అందరినీ మళ్లీ ఇలా కలుసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. దూరప్రాంతాల్లో ఉన్నా, తమ స్నేహం ఏమాత్రం చెక్కుచెదరలేదని సంతోషం వ్యక్తం చేశారు.--- కృతజ్ఞతలు తెలిపిన నిర్వాహకులు కార్యక్రమం విజయవంతంగా ముగిసిన అనంతరం, నిర్వాహక బృందం తరఫున టి.ఎస్.రెడ్డి మాట్లాడారు. ఈ సమ్మేళనానికి ఏమాత్రం ఆలోచించకుండా వేదికను సమకూర్చిన త్రివేణీ విద్యాసంస్థల అధినేత వీరేంద్రనాథ్ చౌదరికి, అడుగడుగునా ఏర్పాట్లు పర్యవేక్షించిన ఇన్‌చార్జులు సందీప్, చార్లెస్‌లకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కార్యక్రమాన్ని ఆద్యంతం హుషారుగా నడిపించిన యాంకర్ విజయశ్రీ, ఆటలు ఆడించిన పీఈటీ శ్యామ్ మాస్టర్, కృష్ణ మోహన్, ఫొటోగ్రాఫర్, దూరప్రాంతాల నుంచి శ్రమకోర్చి విచ్చేసిన పూర్వ విద్యార్థులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. తిరిగి మళ్లీ ఇలాగే కలుసుకుందామన్న ఆత్మీయ వీడ్కోలుతో ఈ సమ్మేళనం కనులపండువగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల యం. అప్పారావు, పార్ధ సారధి, శివారెడ్డి, లింగారెడ్డి, ఉపేందర్, పాషా, జానకి రామయ్య, తిరుపతి రావు, నాగమణి, శాంత తదితరులు పాల్గొన్నారు.

# కోసూరి కుటుంబానికి భరోసా : మంత్రి తుమ్మల

**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఖమ్మం నగరంలో గల త్రీ టౌన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోసూరి రమేష్ గౌడ్ ఇటీవల పరమపదించారు. ఈ విషయం తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయం శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదివారం రమేష్ గౌడ్ ఇంటికి వెళ్లి ఆ కుటుంబాని ఓదార్చారు. మీకు నేను ఉన్నాను అని భరోసా ఇచ్చారు. తొలుత కోసూరి రమేష్ గౌడ్ నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి వారికి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి తుమ్మల వెంట, నగర



కాంగ్రెస్ నాయకులు, త్రీ టౌన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వైశ్యులు ఐక్యతగా ఉండాలి - పట్టణ సంఘం ఆధ్వర్యంలో వనభోజనం..



**నిజామాబాద్, నేటి శుభోదయ :**
వైశ్యులంతా ఐక్యతగా ఉండాలని రాజకీయంగా ఎదగాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు.ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఉత్తర తిరుమలలో వనభోజనం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....ఆషాడ మాసంలో ప్రతి సంవత్సరం వనభోజనాలను ఆనవాయితీగా నిర్వహించడం అభినందనీయమన్నారు.ఆటపాటలతో వైశ్యులంతా ఒక చోటికి చేరడం సంతోషంగా ఉందన్నారు.వైశ్యులంతా ఐక్యతగా ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు.వైశ్యులు అంటే కేవలం వ్యాపారమే కాదని ఆధ్యాత్మికత,ఆలయ అభివృద్ధిలో ముందుంటారని గుర్తు చేశారు.ప్రధానంగా సేవా కార్యక్రమాల్లో వైశ్యులకు సాటి ఎవరు లేరన్నారు.అంతకుముందు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ధన్పాల్ శ్రీనివాస్ గుప్తా,ఇల్లెందుల ప్రభాకర్,కోశాధికారి గాలి నాగరాజు,కార్యవర్గ సభ్యులు,ఆలయ ధర్మకర్త సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్స్‌ను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి



**ఖమ్మం,నేటి శుభోదయ :**
తెలంగాణ రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్ వ్యవస్థను పూర్తిస్థాయిలో పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి, ఉద్యోగులకు 010 పద్దు కింద నేరుగా వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి. కొండయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాడు ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా టీఎస్ఎంఎస్‌టీఎఫ్ సమావేశం యుటియఫ్ భవన్ లో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందించడంలో మోడల్ స్కూల్స్ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మోడల్ స్కూల్స్ లో సంవత్సరాలుగా సేవలందిస్తున్న టీజీటీలకు నోషనల్ సర్వీస్ ప్రయోజనం అందించాలని కోరారు. అలాగే ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 317 జీవో ప్రకారం కేటాయింపులు పూర్తి చేసి అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మోడల్ స్కూల్స్ అభివృద్ధి, ఉద్యోగుల న్యాయమైన హక్కుల పరిరక్షణ మరియు విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిలివేరు మహేష్, టియస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్, మోడల్ స్కూల్స్ బాధ్యులు నాగరాజు, రంజిత్, సాత్విక్, మోహనరావు, నాగార్జున, ఫణికుమార్, ఉపేందర్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం మాదిరిగా కృష్ణా నదిపై బ్యారేజీలు నిర్మించాలి

**వనపర్తి / చిన్నంబావి, నేటి శుభోదయ**



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో కృష్ణ నది సుమారు 200 కిలోమీటర్ల ప్రవహిస్తూ..ఉన్న నిర్వసితులుగా మారిన కొల్లాపూర్, అ ల ంపూర్, గద్వాల వనపర్తి జిల్లాలో సాగు,తాగునీటి సమస్య పరిష్కారానికి కృష్ణా నదిపై బ్యారేజ్ కం రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేయాలని,అలాగే పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు నీటి కేటాయింపు చేయాలనీ ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లో క్రౌన్ గార్డ్ ఫంక్షన్ హాల్ లో సాగు నీటి సమస్య పై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కొల్లాపూర్ నియోజక వర్గం జేఏసీ తరుపున పాల్గొన పెరుమాళ్ళ శ్రీనివాస్ అన్నారు.జూరాల, బీమా చివరి ఆయకట్టు అయిన ఉమ్మడి వీపనగండ్ల మండలంలో సుమారు 45 వేల ఎకరాల కు నీళ్ళు అందించడానికి కృష్ణ నదిపై మరో లిఫ్టు కానీ,లేదా బ్యారేజ్ నిర్మాణం చిన్నంబావి మండలంలో ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టి కి తీసుకెళ్లారు.ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ మల్లు రవి,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వివిధ పార్టీల జిల్లా అధ్యక్షులు, పలు నియోజకవర్గాల జేఏసీ ఇన్చార్జీలు,రాఘవాచారి,ప్రకాశ్ గౌడ్,తిమ్మప్ప,వెంకటేశ్వర్లు, అడ్వకేటు బెక్కం జనార్దన్,వేణుగోపాల్ చారి ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి జేఏసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం లోకొల్లాపూర్ తరుపున తెలంగాణ ఉద్యమకారులు దేశగౌని రామన్ గౌడ్,పెరుమాళ్ళ తిరుపతి, పెరుమాళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఊక చెట్టు వాగులో 100 కిలోల ముసలి కలకలం

- అటవీ శాఖ, స్నేక్ సొసైటీ బృందం సురక్షితంగా బంధించి జూరాల ప్రాజెక్టుకు తరలింపు



**వనపర్తి, నేటి శుభోదయ :**
వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చిలకటోనిపల్లి గ్రామ పరిధిలోని ఊక చెట్టు వాగులో భారీ ముసలి కనిపించడంతో ఆదివారం స్థానిక రైతులు, గ్రామ ప్రజల్లో తీవ్ర కలకలం నెలకొంది. ఊక చెట్టు వాగు వద్దకు వెళ్లిన రైతులు ముసలిని గుర్తించి వెంటనే ఫారెస్ట్ అధికారి పానుగంటి వంశీ, స్నేక్ సొసైటీ సభ్యులు సి. కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ శాఖ అధికారులు, ఎస్ఐ వంశీ, స్నేక్ సొసైటీ సభ్యులు కృష్ణసాగర్, నవీన్, కాజా తదితరులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని రెస్క్యూ నిర్వహించి సుమారు 100 కిలోల బరువున్న ముసలిని సురక్షితంగా బంధించారు. అనంతరం దానిని జూరాల ప్రాజెక్టుకు సురక్షితంగా తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్నేక్ సొసైటీ ప్రతినిధి సి. కృష్ణసాగర్ మాట్లాడుతూ... ముసలి ఊక చెట్టు వాగు ఒడ్డున సుమారు 15 అడుగుల లోతైన రంధ్రాన్ని తవ్వుకుని అందులో నివసిస్తోందని తెలిపారు. వాగు ప్రాంతానికి వచ్చే పశువులు, గొర్రెలను ఆహారంగా తీసుకునే అవకాశం ఉన్నందున ఆ ప్రాంత రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఎక్కడైనా ముసళ్లు, కొండచిలువలు లేదా ఇతర వన్యప్రాణులు కనిపిస్తే వాటిని హింసించకుండా వెంటనే అటవీ శాఖ అధికారులకు లేదా రెస్క్యూ బృందాలకు సమాచారం ఇవ్వాలని కోరారు. మూగజీవులను హింసించడం, చంపడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ రెస్క్యూ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముమ్ముళ్ల అశ్విత రమేష్, ఉపసర్పంచ్ మాందాపురం చిన్న రాములు, మల్లక్ గోపాలు, ఎం. నరేందర్, ఎం. గడ్డం బాబు, బాబు, నాగరాజు, టి. రవికుమార్, బి. జానకి రాములు, బి. శ్రీనివాసులు, ఎం. శ్రీనివాసులు, ఎం. చెన్నకేశవులు, జె. రామకృష్ణ లతో పాటు గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అందరి సహకారంతో ముసలిని సురక్షితంగా అటవీ శాఖ అధికారులకు అప్పగించి జూరాల ప్రాజెక్టుకు తరలించారు.


# మామునూరు ఎయిర్‌పోర్టు పలు డిజైన్‌లను పరిశీలించిన ఎంపీ డా. కడియం కావ్య



**వరంగల్, నేటి శుభోదయ :**
వరంగల్ చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు చాటిచెప్పేలా, కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచే విధంగా మామునూరు విమానాశ్రయం నిర్మాణం జరుగుతుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య అన్నారు.ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో భారతీయ దేవాలయ వాస్తుశిల్పం, శిల్పశాస్త్రం, వారసత్వ పరిరక్షణ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖ స్థపతి, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి డా. ఈమని శివనాగి రెడ్డి గారితో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డా. ఈమని శివనాగి రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం మామునూరు విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన పలు డిజైన్ నమూనాలను పరిశీలించి, వాటిపై సవివరంగా చర్చించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు మామునూరు విమానాశ్రయం రూపకల్పనలో వరంగల్ చారిత్రక విశిష్టత, కాకతీయుల వారసత్వం స్పష్టంగా కనిపించేలా డిజైన్ రూపొందించాలని ఎంపీ సూచించారు. ఇందుకోసం వరంగల్ చరిత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు, నిర్మాణ శైలులు, వారసత్వ కట్టడాల ప్రత్యేకతలను అధ్యయనం చేయాలని కోరారు. విమానాశ్రయం రూపకల్పనలో కాకతీయుల శిల్పకళా వైభవం, వాస్తు సంప్రదాయాలు, వరంగల్ చారిత్రక గుర్తింపును ప్రతిబింబించే అంశాలను పొందుపరచాలని డాక్టర్ కడియం కావ్య వారిని కోరారు. దేశ విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయంలో అడుగుపెట్టిన క్షణం నుంచే వరంగల్ గొప్ప చారిత్రక, సాంస్కృతిక నగరమనే భావన కలిగేలా నిర్మాణ శైలి ఉండాలని ఎంపీ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా కాకతీయ కళాతోరణం, వేయి స్తంభాల ఆలయం, కాకతీయుల అద్భుత శిల్ప సంపదను ప్రతిబింబించే ఆకృతులు, నమూనాలు విమానాశ్రయ నిర్మాణంలో కనిపించేలా చూడాలని ఈ సందర్భంగా కోరారు.వరంగల్‌కు గర్వకారణంగా నిలిచే ఈ విమానాశ్రయం, భవిష్యత్ తరాలకు కాకతీయుల చారిత్రక వారసత్వాన్ని పరిచయం చేసే సాంస్కృతిక చిహ్నంగా రూపుదిద్దుకోవాలని ఎంపీ ఆకాంక్షించారు.

# ఇస్రో తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగంలో భాగమైన శ్రీ చైతన్య విద్యార్థి వినయ్






**ఖమ్మం, నేటి శుభోదయ :**
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఐఎస్ఆర్ఓ) శ్రీహరికోటలో నిన్న విజయవంతంగా నిర్వహించిన భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ ప్రయోగం లో శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్, ఖమ్మం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పూర్వ విద్యార్థి వినయ్ కుమార్ ఇంజనీర్ గా బాధ్యతలు నిర్వర్తించడం కళాశాలకు గర్వకారణమని కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత అంతరిక్ష పరిశోధనా కార్యక్రమంలో తమ కళాశాల పూర్వ విద్యార్థి భాగస్వామి కావడం ప్రతి అధ్యాపకుడికీ, విద్యార్థికి, యాజమాన్యానికి గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని వినయ్ కుమార్ మరోసారి నిరూపించారని అన్నారు.కళాశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు పొందే నాణ్యమైన సాంకేతిక విద్య, ఆధునిక ప్రయోగశాలలలో అందించే ప్రాక్టికల్ శిక్షణ, పరిశోధనా దృక్పథం, క్రమశిక్షణ, నైతిక విలువలు మరియు అధ్యాపకుల నిరంతర మార్గదర్శకత్వం విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విద్యా వాతావరణాన్ని కళాశాల ఎల్లప్పుడూ కల్పిస్తోందని చెప్పారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ విద్యార్థి దశలో తరగతి గది బోధనతో పాటు ల్యాబ్‌లలో పొందిన ప్రాక్టికల్ అనుభవం, మినీ, మెజర్ ప్రాజెక్టులు, సాంకేతిక కార్యక్రమాల్లో పాల్గొనడం, పరిశ్రమలతో అనుసంధానం, అధ్యాపకుల నిరంతర ప్రోత్సాహం వినయ్ కుమార్ విజయానికి బలమైన పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. కళాశాలలో అలవర్చుకున్న క్రమశిక్షణ, సమయ పాలన, సమస్యలను విశ్లేషించే నైపుణ్యం, జట్టు భావన వంటి లక్షణాలే నేడు ఇస్రో వంటి అత్యున్నత సంస్థలో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించడానికి దోహదపడ్డాయని అన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థలు కేవలం డిగ్రీలను అందించడమే కాకుండా దేశ నిర్మాణంలో భాగస్వాములు అయ్యే నైపుణ్యం కలిగిన ఇంజినీర్లను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ భవిష్యత్ సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వినయ్ కుమార్ సాధించిన ఈ ఘనత కళాశాల విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకమని, ఈ విజయం మరెందరో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలుస్తుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో జాతీయ, అంతర్జాతీయ విజయాలను సాధించే విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కళాశాల కట్టుబడి ఉందని తెలిపింది.ఈ సందర్భంగా కళాశాల ఎగ్జిక్యూటివ్ డీన్ డాక్టర్ వి. సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ చార్యులు, శ్రీ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు శ్రీ వినయ్ కుమార్‌ను హృదయపూర్వకంగా అభినందించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి భారతదేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, శ్రీ చైతన్య విద్యాసంస్థలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# సింగరేణిని బలోపేతం చేస్తాం



**ఖమ్మం, నేటి శుభోదయ :**
ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్‌ను అందించడమే కాకుండా, తెలంగాణకు మకుటాయమానమైన సింగరేణి సంస్థను బలోపేతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించిన ఆయన, ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని టేకులపల్లిలో మీడియాతో మాట్లాడారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచేలా, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా ప్రభుత్వం సరికొత్త పథకాలతో ముందుకు సాగుతోందని ప్రకటించారు.సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు తీవ్ర నిర్లక్ష్యం చేసిందని డిప్యూటీ సీఎం ధ్వజమెత్తారు. ఉన్న బొగ్గు గనులు ఖాళీ అవుతున్నా.. కొత్త బ్లాకుల కేటాయింపు కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని మండిపడ్డారు. కొత్త గని ఆపరేషన్‌లోకి రావడానికి 5-6 ఏళ్లు పడుతుందని తెలిసి కూడా, గత ప్రభుత్వం కొత్త బ్లాకుల వేలంలో పాల్గొనకుండా కుట్రపూరితంగా వ్యవహరించిందని అన్నారు. బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్ల సింగరేణి ఇప్పుడు ఇబ్బందుల్లో పడిందని విమర్శించారు. సింగరేణి కార్మికుల అకుంఠిత శ్రమ దీక్ష వల్లే సంస్థ బలంగా నిలబడిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పాత ఫైళ్లన్నీ బయటకు తీసి సింగరేణి హక్కుల కోసం కేంద్రంతో పోరాడామని భట్టి స్పష్టం చేశారు.యూపీఏ ప్రభుత్వం 2013లో తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్ ను సింగరేణి కేటాయించిందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలకులు పదేళ్లుగా ఆ విషయాన్ని పూర్తిగా పక్కన పడేశారని ఆయన విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా లీజ్ ఇవ్వకుండా అడ్డుపడిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం కేంద్రంతో పోరాడి ఈ బ్లాక్‌ను సాధించామని చెప్పారు. ఒడిశాలో ఉన్న నాని బ్లాక్ పర్మిషన్ల కోసం తానే పర్సనల్‌గా అక్కడికి వెళ్లి ఫారెస్ట్, ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్‌లు పూర్తి చేయించానని అన్నారు.గత ప్రభుత్వం వేలానికి వెళ్లక పోవడం వల్లే సత్తుపల్లి, కోయగూడెం బ్లాకులు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని బొగ్గు గనులను 1/70 చట్టం ప్రకారం గిరిజనులు లేదా ప్రభుత్వ రంగ సంస్థలే చేపట్టాలని ఆయన అనాన్రు. ప్రైవేట్ వేలానికి వ్యతిరేకంగా కేంద్రంతో ఇప్పటికీ న్యాయపోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు.సింగరేణిలో భూములు కోల్పోయిన నిర్వాసితులపై ఉపముఖ్యమంత్రి స్పందిస్తూ.. భూమితో రైతుకు ఉండే భావోద్వేగ బంధాన్ని గౌరవిస్తూ, మానవతా కోణంలోనే వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.సింగరేణిలో 45 వేల మంది పర్మనెంట్, 35 వేల మంది కాంట్రాక్ట్/అవుట్‌సోర్సింగ్ కార్మికులు జీవనం సాగిస్తున్నారని, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. దేశంలోనే తొలిసారిగా సింగరేణి కార్మికులకు ప్రమాదవశాత్తు ఏమైనా జరిగితే రూ 1 కోటి ఇన్సూరెన్స్ పథకాన్ని తెచ్చామని, అనంతరం దీన్ని విద్యుత్ రంగ సంస్థలైన ఎస్‌పిడిసి ఎల్, ఎన్ పిడిసి ఎల్, జెన్కో, ట్రాన్స్‌కో లకూ వర్తింపజేశామన్నారు. ప్రస్తుతం ఈ రక్షణను మరింత పెంచి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులందరికీ దురదృష్టవశాత్తు ఏదైనా జరిగితే రూ 1.20 కోట్ల ఇన్సూరెన్స్ అందేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు.గిరిజన ప్రాంతాల అభ్యున్నతికి ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు పోడు భూముల పట్టాలు పొందిన గిరిజన రైతులు ఆత్మగౌరవంతో జీవించేలా, తమ భూముల్లో పసిడి పంటలు పండించుకునేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఈ పథకం కింద వ్యవసాయ అభివృద్ధి కోసం ఉచితంగా సౌర విద్యుత్ అందించడంతో పాటు బోర్ బావులు, పంపుసెట్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను సైతం ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వివరించారు. ప్రస్తుతం వర్షాకాలం (జూలై) అయినప్పటికీ వాతావరణంలో వచ్చిన అసాధారణ మార్పుల వల్ల విద్యుత్ వాడకం ఊహించని విధంగా పెరిగిందని భట్టి తెలిపారు. సాధారణంగా ఈ సీజన్‌లో 11,000 మెగావాట్లు ఉండాల్సిన పీక్ డిమాండ్, కేవలం ఒక్క వారం రోజుల్లోనే సడన్‌గా 50 శాతం పెరిగి 16,600 మెగావాట్లకు చేరిందని అన్నారు. మిడ్ సమ్మర్‌ను తలపించేలా ఈ డిమాండ్ ఉండటం చరిత్రలో ఎన్నడూ లేదన్నారు.విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా ప్రజలకు ఇబ్బంది కలగకుండా 24 గంటలు పనిచేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన చెప్పారు. గతంలో కరెంట్ సమస్యల కోసం సబ్‌స్టేషన్ల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ అవసరం లేకుండా 1912 టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తెచ్చామని అన్నారు. వైద్యారోగ్య శాఖలో 108 తరహాలోనే విద్యుత్ శాఖలో పవర్ అంబులెన్స్ వ్యవస్థను తీసుకొచ్చామని అన్నారు. 1912 కి ఫోన్ చేయగానే.. ట్రాన్స్‌ఫార్మర్, వైర్లు, కట్టర్లు, నిచ్చెన వంటి సామాగ్రి, ఇంజనీర్లు, సిబ్బందితో కూడిన అంబులెన్స్ క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు పూర్తి చేస్తుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 165 పవర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన వివరించారు. ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలవరం కలిగిస్తున్న 'ఎల్ నినో' వాతావరణ ప్రభావం దేశంతో పాటు తెలంగాణపై కూడా పెద్ద ఎత్తున ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ఈ తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల కేవలం మనుషులకే కాకుండా, అడవుల్లోని వన్యప్రాణులకు, జీవజాలానికి తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ ముప్పుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మీడియా మిత్రులు, బాధ్యతాయుత పౌరులు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోత్ రాందాస్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

# బహదూర్‌గూడ రైతులకు పూర్తి న్యాయం చేస్తాం.. ఆందోళన చెందొద్దు : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, నేటి శుభోదయ :** బహదూర్‌గూడ పరిధిలో భూములు కోల్పోతున్న రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని,అర్హులైన రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పష్టం చేశారు.ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన భూ సేకరణ,పునరావాసంపై పలు కీలక విష యాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..భూములు కోల్పోతున్న అర్హులైన ప్రతి రైతు కుటుంబా నికి ప్రభుత్వం 500 గజాల ప్లాటు కేటాయి స్తుందని తెలిపారు.ఈ విషయంపై గతంలోనే రైతులతో సుదీర్ఘంగా చర్చించి హామీ ఇచ్చామని గుర్తుచేశారు. బహదూర్‌గూడ రెవెన్యూ పరిధిలో మొత్తం 1,300 ఎకరాల భూమి ఉండగా,అందులో సుమారు 600 ఎకరాలకు పట్టా పాస్‌బ ుక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి భూ నిర్వాసిత కుటుంబానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో పునరావాసం కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో ప్లాట్లు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో రైతుల ఆస్తి విలువ మరింత పెరుగుతుందని ఎమ్మెల్యే వివరిం చారు.ప్రస్తుతం వ్యవసాయ భూమిగా ఉన్న విలువ కంటే,రోడ్లు,ఇతర మౌలిక సదుపా యాలతో అభివృద్ధి చెందిన లేఅవుట్‌లో ప్లాటు రూపంలో ఆస్తి కలిగి ఉండటం రైతులకు దీర్ఘకాలికంగా ఎక్కువ ఆర్థిక ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పట్టణాభివృద్ధి కూడా అవసరమేనని ఆయన పేర్కొన్నారు.ఈ అంశంపై ప్రతిపక్షాలు కావాలనే రైతులను రెచ్చగొడుతూ అనవ సర ఆందోళనలకు ప్రేరేపిస్తున్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, పోలీసులపై దాడులు చేయడం లేదా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైన పద్ధతి కాదని అన్నారు. సమస్యలు ఉంటే ప్రభుత్వంతో చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవా లని సూచించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని,భూ ములు కోల్పోతున్న అర్హులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మరోసారి హామీ ఇచ్చారు.

# కొండపోచమ్మ రిజర్వాయర్ నుండి నీటిని వెంటనే విడుదల చేయాలి

- **ఎమ్మార్పీఎస్ మర్కుక్ మండల అధ్యక్షుడు మొండి రమేష్ హెచ్చరిక**



**మర్కుక్, నేటి శుభోదయ :** కొండపోచమ్మ రిజర్వాయర్ నుండి కాలువల ద్వారా సాగు నీటిని వెంటనే విడుదల చేయాలని ఎమ్మార్పీ ఎస్ మర్కుక్ మండల అధ్యక్షుడు మొండి రమేష్ డిమాండ్ చేశారు. కాలువల ద్వారా వచ్చే నీటిని అకస్మాత్తుగా నిలిపివేయడంతో, వాటిపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుం టున్న పేద రైతులు తీవ్రంగా నష్టపోతున్నా రని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ నీరు నమ్ముకుని పేద రైతులు అప్పులు చేసి మరీ తమ భూములను సాగుకు అనుకూ లంగా మార్చుకున్నారని తెలిపారు. ఇప్పుడు నీటి సరఫరా నిలిపివేయడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని, దీనివల్ల రైతులు బతుకుదెరువు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రోజువారీగా కాక పోయినా, కనీసం వారానికి రెండు లేదా మూడు సార్లయినా కాలువల ద్వారా నీటిని పంపిణీ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల జీవితా లతో చెలగాటం ఆడుతోందని ఆయన మండి పడ్డారు. అధికారులు స్పందించి వెంటనే నీటిని విడుదల చేయకపోతే, రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేపడు తామని మొండి రమేష్ హెచ్చరించారు.

# కొత్తగూడెం - పాల్వంచ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



**కొత్తగూడెం, నేటి శుభోదయ :**

కొత్తగూడెం–పాల్వంచ జంట పట్టణాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దమ్మపేట–పాల్వంచ ప్రధాన రహదారిలో జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులు రూ.14 కోట్లతో చేపట్టనున్న రెండున్నర కిలోమీటర్ల నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మంచికంటి నగర్ హర్ష టౌన్‌షిప్‌లో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు, పోస్టాఫీస్ సెంటర్ నుంచి గోదుమవాగు వరకు రూ.50 లక్షలతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్, డివైడర్ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనకు సమాన ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల దమ్మపేట–పాల్వంచ రహదారి దెబ్బతిని ప్రజలు, వాహనదా రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, దీనిపై స్పందించి అత్యవసరంగా రూ.14 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు.--- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం పాల్వంచ ప్రాంతంలో దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలు, రిజిస్ట్రేషన్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటికే కొన్ని సర్వేలు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సింగరేణి పరివాహక ప్రాంత ప్రజలకు సంబంధించిన జీవో–76 అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, త్వరలోనే దీనిపై స్పష్టత ఇస్తామన్నారు. పాల్వంచలో కాలుష్య రహిత పరిశ్రమలను నెలకొల్పి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని, కొత్తగూడెం పరిసరాల్లో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు ముమ్మరం చేశామని వివరిం చారు.--- సవాళ్లున్నా, సంక్షేమంలో వెనకడుగు లేదు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నప్పటికీ సంక్షేమ హామీల అమలులో ఎక్కడా వెనకడుగు వేయడం లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నిరంతరాయంగా సాగుతున్నాయన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ గృహాల పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో సుమారు 8 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపామని, ఇప్పటికే 1.50 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్త యిందని వెల్లడించారు. అలాగే, గురుకుల విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచడంతో పాటు, 70 వేల ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేసి యువతకు భరోసానిచ్చామని గుర్తుచేశారు.--- ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి జిల్లాలో నెలకొన్న ఎల్‌నినో పరి స్థితుల దృష్ట్యా రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించా లని మంత్రి కోరారు. నష్టాలు రాకుండా మెట్ట పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కమిషనర్ సుజాత, అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో డాక్టర్ మురళీకృష్ణ జోక్యం లేదు



**వైరా, నేటి శుభోదయ :**
వైరా మున్సిపాలిటీ పాలకవర్గంలో చైర్మన్, వైస్ చైర్మన్ ల మధ్య అంతర్గత పోరు మొదలైంది. అధికార పార్టీ లో ఉన్న చైర్మన్ భర్త మురళీకృష్ణ పై అదే పార్టీలో ఉన్న వైస్ చైర్మన్ కట్ల సంతోష్ కమిషనర్ కు ఫిర్యాదు చేయడంపై కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంసంగా మారింది. అసలు వివాదం ఎక్కడంటే మున్సిపాలిటీ పరిధిలో కొన్నిళ్లుగా సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేస్తూ జీవించే వారున్నారు. వీరు ఓ ట్యాంకర్ ద్వారా ఆయా వ్యర్థాలను తరలించే పనుల్లో ఉపాధి పొందుతు న్నారు. ఏపీలోని చింతలపూడి కి చెందిన మరో వ్యక్తి తన ట్యాంకర్లకు మున్సిపా లిటీ నుంచి ఇటీవల అనుమతి కోసం దరఖాస్తు చేసుకొని సెప్టిక్ ట్యాంకర్ లను స్థానికంగా తిప్పుతున్నారు. ఏపీకి చెందిన వారికి అనుమతిస్తే ఇదే వృత్తిపై ఆధా రపడిన స్థానికులు ఇబ్బంది కలుగుతుందని స్థానికతకు ప్రాధాన్యత ఇవ్వాలనేది వైస్ చైర్మన్ వాదన, వైరా పట్టణం పెరుగుతోందని జనాభా పెరుగుతోందని కొన్ని వేల గృహాలు ఉన్నాయని అనుమతిస్తే స్వచ్ఛతతో పాటు పాత, కొత్తవారు ఉపాధి పొందవచ్చునని మురళీకృష్ణ వాదన, దీనిపై భిన్నభిప్రాయాలు నెలకొ న్నాయి. దీనిపై చర్చించుకునే క్రమంలో కొద్దిపాటి సంభాషణ ఘాటుగా జరిగింది. కొద్ది రోజులు గా జరుగుతున్న ఈ వ్యవహారం వివాదం గా మారింది. ఈ క్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ భర్త డాక్టర్ కాపా ముర ళీకృష్ణ పెత్తనం చెలాయిస్తున్నాడని మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశాడు. వైస్ చైర్మన్ కట్ల సంతోష్ చేసిన ఫిర్యాదు ఆరోప ణల్లో నిజం లేదనివైరా మున్సిపాలిటీ అభివృద్ధిలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, పాలకవర్గ సభ్యులు అనుమతి ఆమోదం తోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, జరుగుతాయని కూడా తెలిపారు. వైరా మున్సిపాలిటీ కార్యాలయం ప్రజల ఆస్తి అని కార్యాలయానికి ఎవరైనా రావచ్చని ఎలాంటి నిబంధనలు లేవని మున్సిపల్ చైర్మన్ ఆమోదంతోనే పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. మున్సిపాలిటీని పాలకవర్గం స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అనుమతితో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మున్సి పాలిటీకి 68 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని వాటిని టెండర్ల ప్రక్రియ ద్వారా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. మున్సిపాలి టీలో చైర్మన్, వార్డ్ కౌన్సిలర్లు భర్తలు మున్సిపాలిటీలో పెత్తనం చలాయిస్తున్నార నేది వాస్తవం కాదని తేల్చి చెప్పారు. మున్సిపాలిటీ పాలకవర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

# మధిర అభివృద్ధికి మల్లు భట్టి విక్రమార్క మరో చరిత్ర ...




**మధిర , నేటి శుభోదయ :**
మధిర నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నూతన ప్రభుత్వ JNTU ఇంజినీరింగ్ కళాశాల స్థాపనకు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అనుమతి మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొబ్బిళ్ళపాటి బాబురావు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా భివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, మధిర నియోజకవర్గానికి ప్రభుత్వ JNTU ఇంజి నీరింగ్ కళాశాలను మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందుబాటు లోకి తీసుకురావాలనే భట్టి విక్రమార్క దూరదృష్టి ఫలితమే ఈ కళాశాల అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం మధిర ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్యా అవకాశాలను మరింత విస్తరించడంతో పాటు, నియోజక వర్గ విద్యా ప్రగతికి కొత్త దిశను చూపుతుం దని అన్నారు.మధిర ప్రజల ఆశయాలను నెరవేర్చుతూ విద్యా రంగంలో చిరస్మర ణీయ నిర్ణయం తీసుకున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బొబ్బిళ్ళపాటి బాబురావు పేర్కొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో భూముల కోల్పోతున్న రైతులకు అండగా ఉండి న్యాయ పోరాటం చేస్తాం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





**రాజేంద్రనగర్, నేటి శుభోదయ :** రేవంత్ రెడ్డి సర్కార్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో భూములు కోల్పోతున్న రైతులకు అండగా ఉండి న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి భీమా వ్యక్తం చేశారు.ఆదివారం శంషాబాద్ టౌన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోలన్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో భూములు కోల్పోతున్న రైతులను మాజీ మంత్రి,ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి పరామర్శించి,వారికి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని,వారి హక్కుల పరిరక్షణ కోసం పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.తెలిపారు.అనంతరం నిన జరిగిన పోలిసులు దాడిలో గాయపడిన కుమారి నరసింహను శంషాబాద్ లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దారిని తెలుసుకొని పరామర్శించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మాంచర్ల మోహన్ రావు,చెక్కల ఎల్లయ్య ముదిరాజ్,మంచార్ల శ్రీనివాస్,మాజీ సర్పంచ్ చెక్కల చెంద్రశేకర్,సల్వేంద్రి వెంకట్ రెడ్డి,చిన్న గండు రాజేంద్రర్,గడ్డమిది యాదగిరి,దీప మల్లేష్,యపకింది యాదగిరి,రాహులప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మిరియాల ప్రీతమ్ జన్మదిన వేడుకలు..





**శేరిలింగంపల్లి, నేటి శుభోదయ :** కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ , ఎక్స్ పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు హాజరై కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకంగా నిలిపారు.సమాజ సేవకు ప్రాధాన్యతనిస్తూ మిరియాల ప్రీతమ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, గిడుగు రుద్రరాజు చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయం అందించడం ద్వారా మిరియాల ప్రీతమ్ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు విహెచ్ హనుమంతరావు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ కాంగ్రెస్ పార్టీ శేర్లింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ఎంబీసీ చైర్మన్ జెర్రీపాటి జైపాల్, మాజీ తాజా కార్పొరేటర్ రఘునాథరెడ్డి , మెట్టు కుమార్ యాదవ్ రాగం నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు మిరియాల ప్రీతమ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పూరి జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్






**రాజేంద్రనగర్, నేటి శుభోదయ :** నార్సింగ్ సర్కిల్ కోకోపేట్ పరిధిలోని హరే కృష్ణ హరే రామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు ఘనంగా నిర్వహించిన శ్రీ పూరి జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవం మరియు ప్రత్యేక పూజా కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా జగన్నాథ స్వామివారి రథయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ భక్తిశ్రద్ధలతో స్వామివారికి నమస్కరించి ఆశీస్సులు పొందారు.అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ.. జగన్నాథ స్వామివారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం, పాడి పరిశ్రమతో పాటు అన్ని రంగాలు అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అదేవిధంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆనందంగా,సుభిక్షంగా జీవించాలని,నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు జగన్నాథ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పీసీసీ కార్యదర్శి ముంగి జైపాల్ రెడ్డి,గండిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్,గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్,నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణు గౌడ్,శ్రీ జగన్నాథ మందిరం నిర్వాహకులు,భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ టర్మినల్ పేరుతో తగిన న్యాయం చేయకుండా రైతుల భూములను లాక్కోవడం సరికాదు

### : ఎంపీలు ఈటల, రాజేందర్,కొండ విశేష రెడ్డి







**రాజేంద్రనగర్, నేటి శుభోదయ :** బుల్లెట్ ట్రైన్ టర్మినల్ పేరుతో తగిన న్యాయం చేయకుండా రైతుల భూములను లాక్కోవడం సరికాదని బహదూర్ గూడ నిర్వాసితులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని విధాలుగా ఆదుకునేందుకు బిజెపి పార్టీ సిద్ధంగా ఉందని ఎంపీలు ఈటల రాజేందర్,కొండ విశ్వేశ్వర్ రెడ్డిలు హామీ ఇచ్చారు.ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలంలోని బహదూర్గుడ గ్రామంలో బుల్లెట్ ట్రైన్ టర్మినల్ పేరుతో తగిన న్యాయం చేయకుండా రైతుల భూములను లాక్కోవడం సరికాదని గ్రామ ప్రజలకు సంఘీభావం తెలపడానికి విచ్చేసిన ముఖ్యులు మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్,ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నియోజకవర్గం ఇంచార్జ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ పలు ముఖ్య నాయకులు కలిసి పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వందల మంది రైతుల జీవన ఆధారంపై ఆధారపడి ఉన్న భూములను అన్యాయంగా దాదాపు 650 ఎకరాల భూమిని లాక్కుని ప్రయత్నం చేయడం చాలా దుర్మార్గపు చర్య అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.భూమి పట్టాలు ఇస్తామని మోసం చేశారని రాష్ట్ర ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు.ఇప్పుడు భూమిని దౌర్జన్యంగా లాక్కుంటున్నారని, స్థానిక శాసనసభ్యుడు ఎక్కడ పోయాడు అని తీవ్రంగా ఖండించారు.ఈ పేద ప్రజలపై ఎందుకు అంత చిన్న చూపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయడం జరిగిందన్నారు. అనంతరం గ్రామస్తుల నష్టపోకుండా వారి సూచన సలహాలు పరిగణంలోకి తీసుకొని చర్చించడం జరిగిందన్నారు.తగిన న్యాయం జరిగే వరకు వదిలే పరిస్థితి లేదని వారన్నారు.సమస్య పరిష్కారం అయ్యే విధంగా గ్రామస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం దిగి వచ్చేంతవరకు పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతాయని తెలిపారు. అంతేకాకుండా ఈ సమస్యపై ఎంత దూరమైన వెలి అన్ని విధాలుగా అండగా ఉంటామని గ్రామస్తులకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సార్) కార్యక్రమాన్ని విజయవంతం చేయండి బీజేపీ జిల్లా ఇంచార్జి డాక్టర్ కోరదాల నరేష్





**హఫీజ్ పేట్, నేటి శుభోదయ :** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సార్) కార్యక్రమాన్ని చేయాలని బీజేపీ జిల్లా ఇంచార్జి డాక్టర్ కోరదాల నరేష్ తెలిపారు.ఆదివారం హఫీజ్ పేట్ డివిజన్ గంగారం గ్రామం బస్తీ దవాఖాన,గంగారాం ఎంపీపీ స్కూల్,ఇంజనీర్ ఎంక్లేవ్,హుడా కాలనీ,ఆర్టీసీ కాలనీ,మై హోమ్ జివెల్ లో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సార్) కార్యక్రమాన్ని ఆయా పోలింగ్ బూత్‌ల బిఎల్ ఓలు,బిజెపి బిఎల్ఎ-2 లతో కలిసి పరిశీలించిన బీజేపీ జిల్లా ఇంచార్జి డాక్టర్ కోరదాల నరేష్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అజిత్ కుమార్ సేనాపతి,హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్.ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫోరం పంపిణీ,ఓటరు మార్పులు,చేర్పులు,తొలగింపుల ప్రక్రియను సమీక్షించి,(సార్) కార్యక్రమం సజావుగా నిర్వహించేలా అవసరమైన సూచనలు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ మాజీ కౌన్సిలర్ రమణయ్య,హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులు ప్రసాద్ పాత్రో,హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ కోశాధికారి సుభాష్, బీజేపీ నాయకులు మోహన్ ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్,రామ్ రెడ్డి, హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ యువ మోర్చా ప్రధాన కార్యదర్శి బాలరాజు,బీజేపీ నాయకులు సూర్య, తరుణ్, భాస్కర్, వినోద్, ఇతరులు పాల్గొన్నారు.

# 15 ఏళ్ల, ఓల్డ్ నేరేడుమెట్ గౌడ సంఘం స్మశాన వాటిక స్థలం కోర్టు వివాదానికి తెరదించిన మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్

**మల్కాజిగిరి, నేటి శుభోదయ :** వివరాల్లోకి వెళితేగౌరవ శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశాల మేరకుఓల్డ్ నేరేడుమెట్, గౌడ కులస్తులకు చెందిన స్మశాన వాటిక స్థలం, గత 15 ఏళ్లుగా కోర్టు వివాదాల సమస్యల్లో ఉంది, ఈ సమస్యపై కోర్టు గత 15 రోజుల క్రితం గౌడ కులస్తులకు అనుకూలంగా తీర్పు వెల్లడించారు★★★ఓల్డ్ నేరేడుమెట్ లోని స్మశాన వాటిక స్థలం గౌడ కులస్తులకు చెందాలని కోర్టుల్లో న్యాయం కోసం గత 15 సంవత్సరాలుగా పోరాడారు★★★గౌడ కులస్తులకు కోర్టులో అను కూలంగా తీర్పు రావడంతో గౌరవ శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశే ఖర్ రెడ్డి గారి సూచన మేరకు వారం రోజుల క్రితం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ గారిని కలిసి కోర్టు తీర్పు పత్రాలను అందించడం జరిగింది★★★జోనల్ కమిషనర్ గారు తక్షణమే స్పందించి కోర్టు తీర్పును అనుసరిస్తూ కోర్టు వివాదంలో ఉన్న స్మశాన వాటిక స్థలం గౌడ కులస్తులకు చెందినదిగా ప్రొసీడింగ్స్ పత్రాలను జారీ చేశారు★★★ఈ రోజు ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయంలో గౌరవ శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారికి మరియు మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ గారికి జోనల్ కమిషనర్ గారు జారీచేసిన ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేయడం జరిగింది.★కోర్టు కేసు విచారణను నిరంతరం పర్యవేక్షిస్తూ మా గౌడ కులస్తులకు అండగా నిలిచి తగిన సలహాలు సూచనలు, అందించి మాకు న్యాయం జరిగేలా కృషిచేసిన గౌరవ శాసనస భ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారికి మరియు మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ గారికి ఓల్డ్ నేరేడుమెట్ గౌడ సంఘం వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు★★★ఈ సందర్భంగా ఓల్డ్ నేరేడుమెట్ కి





చెందిన సుమారు 100 మంది గౌడ కులస్తుల కుటుంబాలు గౌరవ శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారిని మరియు మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ గారిని ఘనంగా సన్మానించడం జరిగింది★★★ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు టి.వి. నరేందర్ గౌడ్,ఈశ్వర్ గౌడ్,పవన్ గౌడ్,శ్రీకాంత్ గౌడ్,జే కె సాయి గౌడ్,విశ్వనాథ్ గౌడ్,అభిషేక్ గౌడ్,జహంగీర్ గౌడ్,గిరి గౌడ్,గంగా ధర్ గౌడ్,వినోద్ గౌడ్ మరియు గౌడ సోదరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.★

# ఘనంగా కాంగ్రెస్ యువనాయకుడు మిరియాల ప్రీతమ్ జన్మదిన వేడుకలు..



**శేరిలింగంపల్లి, నేటి శుభోదయ :** చందానగర్ కు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, బిల్డరు వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ మిరియాల రాఘవరావు కుమారుడైన కాంగ్రెస్ యువ నాయకుడు మిరియాల ప్రీతమ్ జన్మదిన వేడుకలు ఆదివారం శేరిలింగంపల్లిలోని చందానగర్ లోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శేరిలింగం పల్లి ప్రాంతానికి చెందిన పలువురు జర్నలిస్టులు ప్రీతమ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో జర్నలిస్టులు సీనియర్ బి.కృష్ణ, అశోక్, బండి రామకృష్ణ గౌడ్, రవీందర్ రెడ్డి, కర్ర బాబు, శ్రీకాంత్, విజయ్, పాల్గొని, మిరియాల ప్రీతమ్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత చేరువై సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలవాలని వారు అభిలషించారు. మిరియాల ప్రీతమ్ యువత సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో ఎల్లప్పుడూ ముందుండి ప్రజల మన్ననలు పొందుతున్నారని వారు పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తూ ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలలో కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు పెద్ద ఎత్తున హాజరై మిరియాల ప్రీతమ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# బంధాలకు అనుబంధాలకు తావు లేదు

**ఖమ్మం, నేటి శుభోదయ :** నేటి సమాజంలో బంధాలకు అను బంధాలకు తావు లేదు. అన్ని ఆర్థిక బంధాలతో ముడిపడి ఉన్నాయి. దానికోసం ఇంతకైనా తెగించే వ్యక్తులు తయారవు తున్నారు. తండ్రి ఉద్యోగం తో పాటు తనకు ఆస్తి ఇవ్వలేదని అక్కనో, తల్లిని హతమార్చిన సంఘటన. ఆస్తుల విషయంలో సోదరుల ను సోదరులు హతమార్చిన సంఘటనలు వెలుగు లోకి వస్తున్నాయి. ఒక కుమారుడు తనకు ఆస్తిని పంపించమని కోరితే ఇవ్వకుండా పడుకునే హతమార్చిన సంఘటన. తల్లిదం డ్రుల వద్ద ఆస్తులు రాయించుకుని వారిని వీధిన పాలు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. వంతుల వారి పేరిట కూతుర్లు, కొడుకులు సరిగ్గా చూడకుండా అవసాన దశలో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పొలం పంపకాల విషయంలో వృద్ధ దంపతు లపై కూతుళ్లు, కుమారులు దాడి చేస్తున్న సంఘటనలు అధికంగా ఉన్నాయి. నమ్మి బంధువులకు కౌలుకిస్తే ఆ భూమిని ఆక్రమించుకునే సంఘటనలు కూడా ఉన్నాయి. అక్రమంగా చొరబడి దాయాదుల భూములను ఆక్రమించుకొని ప్రశ్నిస్తే హతమార్చిన సంఘటనలు కూడా నేడు కొల్లలు. కొందరు అధికార మదంతో తమకున్న పలుకుబడితో రెంటుకు ఉన్న ఇంటిని నకిలీ పాత్రలతో స్వాధీనం చేసుకుంటున్న సంఘట నలు ఉన్నాయి. ఎవరైనా అండ దండలు లేక అస్తిపరులు ఉంటే వారిని ఆస్తులను లాక్కొని ముస్కర్లు కూడా ఉన్నారు. స్థలం విలువ మార్కెట్లో పెరిగిపోవడంతో ఆక్రమణలు ఎక్కువై దాడులకు పాల్పడుతున్న సంఘటనలు ఎక్కువవుతున్నాయి. ఖాళీ స్థలాలు కనబడితే వారి కుటుంబ వివరాలు తెలుసుకొని వారి బలహీనులా బలవంతమైన తెలుసుకొని పక్కనుంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. అమాయకులు తమ ఆస్తులు పరిరక్షిం చుకుని క్రమంలో వారి జీవితకాలం సరిపోతుంది. వారి పిల్లలకు న్యాయం చేయలేని పరిస్థితిలో కొందరు కుటుంబ సభ్యులు ఉన్నారు. చట్టాలు కఠినంగా ఉంటే ఇలాంటి వాటికి ఆస్కారం ఉండదు మరి.

# వర్షాల కోసం వింత పూజ..

## గాడిదలకు గులాబ్ జామూన్లు తినిపిస్తున్న జనం!



**భోపాల్, నేటి శుభోదయ :** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో రుతుప వనాల రాక ఆలస్యం కావడంతో స్థానికులు వర్షాల కోసం ఒక వింత ఆచారాన్ని ఆశ్రయించారు. నగరంలో తీవ్రమైన ఉక్కపోత, పొడి వాతావరణం నెలకొనడంతో.. వానలు పడాలని కోరుకుంటూ గాడిద లకు 'గులాబ్ జామూన్లు' తినిపించే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గాడిదలకు ఎంతో ఇష్టంగా ఈ భారతీయ సంప్రదాయ స్వీటును తినిపించారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో దేశవ్యాప్తంగా నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. వర్షాలు సమయానికి పడకపోయినా, రుతుపవనాలు బలహీనపడినా ఈ వింత ఆచారాన్ని పాటించడం ఇక్కడ ఎప్పటి నుంచో వస్తున్న ఒక సంప్రదాయం. ఇలా జంతువులకు తియ్యటి పదార్థాలు తినిపించడం వల్ల వాన దేవుడైన ఇంద్రుడు ప్రసన్నమై, సకాలంలో వర్షాలు కురుస్తాయని ప్రజల గట్టి నమ్మకం. "వర్షాలు ఆలస్యమైనప్పుడు మా పెద్దలు ఈ సంప్రదాయాన్ని పాటించడం మేము చిన్నప్పటి నుండి చూస్తున్నాం. అందుకే గాడిద లకు స్వీట్లు తినిపించి మంచి వర్షాలు పడాలని ప్రార్థించాం" అని ఈ వేడుకలో పాల్గొన్న ఒకరు తెలిపారు. భోపాల్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. వాతావరణ శాస్త్రవేత్తలు రుతుపవనాల గమనానికి వాతా వరణ మార్పులే కారణమని చెబుతున్నప్పటికీ.. ఇలాంటి సంప్రదా యాలు భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజల జీవన విధానంలో అంతర్భాగంగా మారిపోయాయి. ఈ వింత పూజతో వాన దేవుడు కరుణిస్తాడో లేదో చూడాలి కానీ, ప్రస్తుతానికి మాత్రం భోపాల్‌లోని గాడిదలు గులాబ్ జామూన్ల విందును ఆరగిస్తూ పండగ చేసుకుంటు న్నాయి.

# క్రీడలతో స్ఫూర్తినిచ్చిన సినిమాలు

**ఖమ్మం, నేటి శుభోదయ :** క్రీడాకారులకు సినిమాల ద్వారా స్ఫూర్తినిచ్చిన అనేక చిన్న చిత్రాలు భారతదేశంలో నిర్మించడం జరిగింది. బ్రిటిష్ ప్రభుత్వంతో క్రికెట్ రూపంలో గెలుపొంది తన హక్కులను సాధించుకున్న సినిమాగా "లగాను" నిర్మించడం జరిగింది. అలాగే కుస్తీ పోటీలు స్ఫూర్తితో "దంగల్" అనే అనే చిత్రాన్ని నిర్మించడం జరిగింది. మన జాతీయ క్రీడ అయిన హాకీ నేపథ్యంలో "చెక్ దే ఇండియా" నిర్మించడమే కాక ఎందరో క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చింది. కుటుంబ నేపథ్యం బంధాలు వారితో పెనువేసుకున్న క్రీడా నేపథ్యంలో అనేక సినిమాలు నిర్మించడం జరిగింది. ప్రముఖ నటుడు దివంగత జిమ్నాస్టిక్ క్రీడాకారుడైన శ్రీహరి హీరోగా కిక్ బాక్సింగ్ నేపథ్యంలో "భద్రాచలం" వంటి సినిమాలు నిర్మించడం జరిగింది. కబడ్డీ నేపథ్యంలో "భీమిలి కబడ్డీ" నాని హీరోగా నిర్మించారు. "కబడ్డీ కబడ్డీ" నేపథ్యంలో జగపతిబాబు హీరోగా నటించిన జరిగింది. ప్రముఖ దర్శకుడు విశ్వ ఖ్యాతిని పొందిన రాజమౌళి రబీ నేపథ్యంలో "సై" అనే చిత్రాన్ని నిర్మించడం జరిగింది. క్రికెట్ నేపథ్యంలో ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో "కౌసల్య కృష్ణమూర్తి" సినిమా నిర్మించారు. పవన్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా "తమ్ముడు" సినిమాలో బాక్సింగ్ క్రీడాంశంగా నిర్మించడం జరిగింది. అలాగే "జై" అనే సినిమా కూడా బాక్సింగ్ నేపథ్యంలో నిర్మించడం జరిగింది. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ "బయోపిక్కు" నటుడు సుధీర్ బాబు హీరోగా నిర్మించడం జరిగింది. ఇటీవల వచ్చిన "పెద్ది సినిమాలో మూడు కేటాంశాలను తీసుకొని నిర్మించడం జరిగింది. రామ్ చరణ్ హీరోగా ఇందులో క్రికెట్ కుస్తీ అథ్లెటిక్ అంశాలుగా నిర్మించడం జరిగింది. తమిళనాడు విజయ్ హీరోగా ఫుట్బాల్ కోచ్ గా నేపథ్యంలో సినిమాలు నిర్మించడం జరిగింది. రేస్ కు సంబంధించి అజిత్ తోపాటు కార్తికేయ కూడా నటించిన జరిగింది. మన తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తొలుత క్రీడా స్ఫూర్తితో అశ్విని నా చెప్పు ప్రధాన పాత్రలో భానుచందర్ కోచ్ గా "అశ్విని" అనే చిత్రాన్ని నిర్మించడం జరిగింది. అమీర్ ఖాన్ హీరోగా గత కొన్ని ఏళ్ళ క్రితం సైకిల్ రేస్ కు సంబం ధించిన చిత్రం నిర్మించారు. క్రీడా అంశాల మీద ప్రముఖ క్రీడాకారులు బయోపిక్కు నిర్మించేందుకు ఎందరో నిర్మాతలు ఆసక్తి చూపుతో ముందుకు వస్తున్నారు ఇది క్రీడాకారులకు ఇస్తున్న గౌరవ వందనంగా చెప్పవచ్చు.

గతించిన క్రీడాకారులు వారు దేశానికి చేసిన సేవలు వెంటనే దృష్టిలో ఉంచుకొని సినిమాలు నిర్మించడం భారత చలనచిత్ర పరిశ్రమకు గర్వకారణంగా చెప్పవచ్చు.

ఎందరో హీరోలు అమీర్ ఖాన్, షారుఖ్ ఖాన్, నాని, అజిత్, జగపతిబాబు, నితిన్, శివ కార్తికేయ, విజయ్, ఐశ్వర్య రాజేష్, బస్తి కుస్తీలో నటించిన ఐశ్వర్య సౌందర్య వంటి నటులు వారి నటనతో క్రీడా పూర్తిగా నింపారు అనుటలో ఎలాంటి సందేహం లేదు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620